ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

బుధవారం 25 డిసెంబరు 2024 | 5





అమలాపురంలో క్రీస్తు జననంపై ప్రదర్శన

నీ రాక కోసం..

జిల్లా వ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలకు ఏర్పాట్లు

కళకళలాడుతున్న చర్చిలు

నేడు ప్రత్యేక ప్రార్థనలు



కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

క్రీస్తు బోధనలు ఆచరణీయం

కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రీస్తు బోధనలు ఆచరణీయమని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ చెప్పారు. ఏసుక్రీస్తు అందించిన శాంతి, ప్రేమ, దయ, ఐకమత్యం సందేశాన్ని ప్రతీ ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ మత పెద్దల అభీష్టానికి అనుగుణంగా వివాహ లైసెన్సుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కమ్యూనిటీ హాళ్లు, క్రైస్తవ ప్రార్థనా మందిరాల నిర్మాణానికి ప్రభుత్వ స్థలాల ఎంపికకు తగిన సహకారం అందిస్తామన్నారు. ఏసుక్రీస్తు జన్మదిన వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ వేడుకల కేక్‌ను కట్‌చేసి చిన్నారులకు కలెక్టర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెవ.నున్న ప్రభుకుమార్, ఎంఈవో సుధ, వై.పరంజ్యోతి, పాస్టర్ ఇమ్మానియేల్‌లు క్రీస్తు జననం గురించి వివరించారు. ఏసు ప్రభువు జన్మ వృత్తాంతాన్ని తెలిపే నృత్య గేయాలు, ప్రార్థనలు, గీతాలను ఆలపించారు. మైనార్టీ సంక్షేమ అధికారి ఎం.సునీల్‌కుమార్, వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్, విద్యార్థులు, పాస్టర్లు పాల్గొన్నారు.

చర్చిలు కళకళ..

అమలాపురం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. పలు చర్చిల్లో మంగళవారం రాత్రి నుంచి ప్రార్థనా గీతాలను ఆలపిస్తున్నారు. క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని అమలాపురంలోని ప్రధాన క్రైస్తవ ప్రార్థనా మందిరాలన్నీ విద్యుత్ దీపాలతో కళకళలాడుతున్నాయి. అమలాపురం నల్ల వంతెన దిగువన ఉన్న మన్నా జూబ్లీ చర్చిలో కార్ల్ డేవిడ్ కొమానపల్లి, షారోన్ రోజ్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలకు ఏర్పాట్లు చేశారు. రెవ. ఎర్నెస్ట్ తాతపూడి, ఎస్తేరు జ్యోతి తాతపూడి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అదే విధంగా ఏరియా ఆసుపత్రి సమీపంలోని హెబ్రోన్ చాపల్ జీడీఎం చర్చి, మహిపాల వీధిలోని అమలోద్భవీమాత ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. సినిమారోడ్డులోని సెయింట్ లూథరన్ చర్చి శోభాయమానంగా కనిపిస్తోంది. లూథరన్ చర్చిలో రెవ.కేకే పాల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. డెలిగేట్‌లు నక్కా రాజ్‌కిశోర్, టి.పెద్దబ్బాయి, గూటం ప్రసాదరావు, జి.కృపావరం, సీహెచ్ చిట్టిబాబు పర్యవేక్షణలో ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. పలు ప్రార్థనా మందిరాల్లో క్రీస్తు జననాన్ని అందరికీ తెలిసేలా ప్రత్యేక సెట్టింగులను ఏర్పాటు చేశారు. విద్యుత్ దీపాలతో అలంకరించిన క్రిస్మస్ ట్రీలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

కొత్తపేట: పలివెల ఆర్‌సీఎం చర్చి






కొత్తపేట: పలివెల ఆర్‌సీఎం చర్చిలో క్రీస్తు జననంపై సెట్టింగ్



అమలాపురం సినిమా రోడ్డులో సెయింట్ లూథరన్ చర్చి



అమలాపురం మన్నా జూబ్లీ చర్చిలో..



అమలాపురంలో మన్నాజూబ్లీ చర్చి

మాదక ద్రవ్యాల వినియోగంపై పటిష్ట నిఘా ఉండాలి

కలెక్టర్ మహేష్‌కుమార్



కలెక్టర్ సమీక్షలో పాల్గొన్న ఎస్పీ కృష్ణారావు

అమలాపురం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదక ద్రవ్యాలకు బానిసలు కాకుండా పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం మాదక ద్రవ్యాల వాడకం, నిరోధంపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. విద్యార్థులతో పాటు యువతను సన్మార్గంలో నడిపించడం వారిలో వ్యక్తిత్వ వికాసం, కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగుపరిచి ఉన్నత లక్ష్యాలకు చేరుకునే దిశగా ప్రోత్సహించాలన్నారు. మాదక ద్రవ్యాల బారినపడ్డ యువత కుటుంబాలు ఏవిధంగా అస్తవ్యస్తం అవుతున్నాయో అందరికీ అర్థమయ్యే విధంగా పోస్టర్లు, పాంప్లేట్లు, బ్యానర్లను పాఠశాలలు, కళాశాలల ప్రాంగణాల్లో ఏర్పాటు చేయాలన్నారు. ఎన్‌సీసీ విద్యార్థులు, ఉపాధ్యాయులతో ప్రత్యేకంగా క్లబ్‌లు ఏర్పాటు చేసి కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. యువత ఒకసారి డ్రగ్స్‌ను వినియోగిస్తే ఏమీ కాదన్న భ్రమలో ఉంటున్నారని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు పేర్కొన్నారు. గంజాయి అక్రమ రవాణా అడ్డుకునేందుకు పటిష్టమైన చర్యలు తీసుకున్నామన్నారు. సమావేశంలో డీఈవో షేక్ సలీంబాషా, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, ఏపీడీ రాంబాబు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తీర ప్రాంత భద్రత మరింత పెంపు..

సముద్ర తీరప్రాంత భద్రతను మరింత మెరుగుపరిచే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో విశాఖపట్నం కోస్టల్ సెక్టార్ పోలీస్ అడిషనల్ ఎస్పీ మధుసూదనరావు, జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, జిల్లా మత్స్యశాఖ అధికారి ఎన్.శ్రీనివాసరావు, కోస్ట్‌గార్డు అధికారులతో సమావేశం నిర్వహించి తీరప్రాంత భద్రత రక్షణ చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సముద్ర తీరప్రాంతంలో ఉన్న మెకనైజ్డ్ బోట్‌లకు ట్రాన్స్‌పాండర్స్ కమ్యూనికేషన్ వ్యవస్థను అమర్చి జీపీఎస్ మాదిరిగా ట్రాకింగ్ డివైజ్ ద్వారా మత్స్యకారుల రక్షణ, భద్రత, అత్యవసర సమయంలో సమాచారం అందించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. విదేశీయులు తీర ప్రాంతంలో చొరబడకుండా కమ్యూనికేషన్ వ్యవస్థ దోహదపడుతుందన్నారు. తీర ప్రాంతంలో నిఘా కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు పెట్రోలింగ్ కార్యక్రమాలు బలోపేతం చేయాలన్నారు. మెరైన్ పోలీసుల సమస్యలపై ఆరా తీశారు. పెట్రోలింగ్ బోట్‌లు ఆపరేషన్‌లో లేవని, తీర ప్రాంత గస్తీకి సంబంధించి అత్యవసర సందర్భంలో ఫోర్‌వీల్ వాహనాల అవసరం ఉందని, వాటిని సమకూర్చాలని కోరారు. మెరైన్ సీఐ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు

7లో

అంబేడ్కర్‌ను గౌరవించే పార్టీ బీజేపీ: పురందేశ్వరి

7లో



ఉడిమూడి వద్ద ప్రధాన పంట కాల్వలో పేరుకుపోయిన తీగ మొక్కలు



గంటిపెదపూడి శివారు చింతావారిపేట వద్ద ప్రధాన పంట కాలువలో పేరుకుపోయిన తీగ మొక్కలు

సాగునీరు సాగేదెలా?

ప్రధాన పంట కాలువలో పేరుకుపోయిన తీగ మొక్కలు

పత్తాలేని కాంట్రాక్టర్...పట్టించుకోని అధికారులు

పి.గన్నవరం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సాగునీరు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నప్పటికి కాల్వల్లో పేరుకుపోయిన వ్యర్థాలు, గుర్రపు డెక్కలు కారణంగా నీరు ముందుకు పోయే పరిస్థితి లేదు. ప్రధాన పంట కాల్వల్లో భారీగా గుర్రపుడెక్క, తీగమొక్కలు పేరుకుపోయి సాగునీరుకు అడ్డంకిగా తయారయ్యాయి. సంబంధిత గుత్తేదారులు పత్తాలేకపోవడంతో పంట కాల్వలు కాస్త చెత్తకాల్వల్లా దర్శనమిస్తున్నాయి. ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం కాల్వలను కనీసం పట్టించుకోకపోవడంతో పూడికతీత భారీగా పేరుకుపోయి సాగునీరు ముందుకు పోయే పరిస్థితి లేదు. రాబోయే రెండో పంటకు రైతులు సన్నద్ధం అవుతున్న తరుణంలో ప్రధాన పంటకాల్వలు ద్వారా చిన్న కాల్వలకు పూర్తిస్థాయిలో సాగునీరు వెళ్లాల్సిన అవసరం ఉంది. ఈ క్రమంలో కాల్వల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించాల్సిన పరిస్థితి ఉంది. అయితే మొదటి, రెండో పంటల ప్రారంభ సమయంలో సంబంధిత కాంట్రాక్టర్ ప్రధాన పంట కాల్వలతో పాటు చిన్న కాల్వల్లో కూడా నిబంధనలు అనుసరించి చెత్తను తొలగించాలి. కానీ ప్రస్తుతం ఆ దిశగా కాల్వల్లో చెత్త తొలగించే పరిస్థితి కనబడటం లేదు. ఈ నేపథ్యంలో పి.గన్నవరం మండలంలోని ఉడిమూడి, గంటిపెదపూడి తదితర ప్రాంతాలలో ప్రధాన పంట కాల్వల్లో భారీగా తీగ మొక్కలు పేరుకుపోయి కాల్వలు అధ్వానంగా మారాయి. అంతే కాకుండా పలు ఛానల్‌లు పరిధిలోని చిన్న కాల్వల దుస్థితి కూడా దారుణంగా ఉంది. కనీసం అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వ్యర్థాపు గొట్టాలను సైతం కాల్వల్లోకి ఏర్పాటు చేయడంతో ఆ ప్రాంత కాల్వలు డ్రైన్లను తలపిస్తున్నాయి. దీంతో వరి చేలల్లో దిగే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి కాల్వల్లో పేరుకుపోయిన తీగ మొక్కలు, గుర్రపు డెక్కను తొలగించే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



నీటితో చెరువుల్లా ఉన్న ఓల్డ్ అయినాపురం ఆయకట్టు పొలాలు

ఇప్పటికీ బయటకుపోని పొలాల్లోని ముంపు నీరు

నీరు దిగేందుకు సహకరించని డ్రెయిన్లు

ఆందోళనలో పర్ర ప్రాంతాల రైతులు

పర్రలో దాళ్వా సాగుకు దారేది?

ఉప్పలగుప్తం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): కోనసీమలో పల్లపు ప్రాంతాల పొలాలు సుదీర్ఘ కాలంగా ఏడాదికి ఒక్క పంటకే పరిమితమయ్యాయి. ఏడాదికి ఏడు నెలలు ఈ భూములు నీటిలోనే ఉంటాయి. ముంపు ఇక్కట్లు పడలేక సార్వాకు పర్ర రైతులు ఎప్పుడో స్వస్తి పలికారు. పర్ర భూముల రైతాంగానికి దాళ్వా పంట మాత్రమే దిక్కు. ఇప్పుడా దాళ్వా సాగుకు సైతం దారిలేక రైతులు అయోమయంలో పడ్డారు. సార్వా సాగు లేనందున ముందస్తుగానే పొలాలు దుక్కి దున్ని దాళ్వా నాట్లు వేసుకుని మెరక పొలాల రైతుల కంటే ముందు పంటను ఒడ్డుకు చేర్చుకునేవారు. ఈ ఏడాది ఇప్పటికీ పర్ర పొలాలు చెరువులు మాదిరిగా ఉన్నాయి. డ్రెయిన్లు తన్నిపట్టడంతో ముంపునీరు పొలాల్లోనే తిష్ట వేసింది. దాళ్వా సాగుకు సమయం మించిపోతోంది. ఓల్డ్ అయినాపురం, రంగరాజుకోడు, గొరగనమూడి ఆయకట్టు పరిధిలో పర్ర పొలాల ముంపు దిగేందుకు మార్గాలు లేక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోటార్ల సహాయంతో ముంపునీటిని బయటకు తోడుకుంటున్నారు. దీని కోసం ఎక్కువ పెట్టుబడి పెట్టలేక చిన్న, సన్నకారు రైతులు సతమతమవుతున్నారు. జీవనాధారమైన పచ్చని పొలాల్లో ఏడాదికి ఒక పంటకు కూడా నోచుకోలేకపోతే తమ కుటుంబాల పరిస్థితి ఏమిటంటూ ప్రశ్నిస్తున్నారు. డ్రెయిన్లు సకాలంలో ఆధునికీకరిస్తే ఏడాదికి ఒక్క పంటైనా సాగు చేసుకునే వీలుండేదంటున్నారు. నూతనంగా ఏర్పడిన నీటి సంఘాల ప్రతినిధులు పర్ర భూముల ముంపు సమస్యను తక్షణం పరిష్కరించాలని కోరుతున్నారు.



వానపల్లిపాలెంలో ముంపు నీటిని బయటకు తోడుతున్న దృశ్యం

మత్స్యకారులకు నష్ట పరిహారం

ఈ నెల 28న కోరంగిలో పంపిణీ చేసేందుకు చర్యలు ● కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏడు మండలాల పరిధిలోని 54 గ్రామాలకు చెందిన మత్స్యకారులకు ఆరో విడతగా ఓఎన్జీసీ సంస్థ ఈ నెల 28న నష్ట పరిహారాలు అందించనున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. తాళ్లరేవు మండలం కోరంగిలో నష్ట పరిహారాల పంపిణీ సభ నిర్వహించనున్నట్టు వెల్లడించారు. కలెక్టరేట్‌లో మంగళవారం నష్ట పరిహారం పంపిణీ సన్నద్ధత ఏర్పాట్లపై ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. ఓఎన్జీసీ కేజీ బేసిన్ పైపులైన్ డ్రిల్లింగ్ కార్యకలాపాల సమయంలో మత్స్యకారుల చేపల వేట నిషేధిత నష్టానికి గాను ఓఎన్జీసీ సంస్థ నష్టపరిహారం పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కె.అచ్చెన్నాయుడు, రాష్ట్ర గనులు, అబ్కారీ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు. 54 గ్రామాల పరిధిలోని 16,408 మంది మత్స్యకారులకు ఐదున్నర నెలలకుగాను ఒక్కొక్కరికీ నెలకు రూ.11,500 చొప్పున రూ.63,250 మొత్తాన్ని అందించనున్నారు. ఇందుకు గాను రూ.103.78 కోట్లు సొమ్మును ప్రత్యక్ష నగదు బదిలీ విధానంలో మత్స్యకారుల బ్యాంకు ఖాతాలకు జమ చేయనున్నట్టు కలెక్టర్ తెలిపారు. అదే విధంగా కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలంలో 15 గ్రామాల పరిధిలోని 7050 మంది మత్స్యకారులకు నష్టపరిహారాలు చెల్లించనున్నట్టు వివరించారు. ఇరు జిల్లాల డివిజన్లకు చెందిన ఆర్డీవోలు, డీఎస్పీలు, జిల్లాకు చెందిన డీఆర్డీఏ, డ్వామా పీడీ, జిల్లా మత్స్యశాఖ అధికారి పూర్తి సమన్వయంతో నిర్వహణ ఏర్పాట్లు విజయవంతంగా చేయాలని ఆదేశించారు. సమావేశంలో అమలాపురం ఆర్డీవో కె.మాధవి, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, జిల్లా మత్స్యశాఖ అధికారి ఎన్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్



రక్షకుడు ఉదయించినాడు

క్రిస్మస్ విశిష్టత, ఏసు బోధనలపై ప్రత్యేక వార్తలు..

6లో

రశీదులు తీసుకోక నష్టపోతున్నారు: జేసీ



విజేతలకు బహుమతులు అందించిన దృశ్యం

అమలాపురం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులు కొనుగోలు చేసిన వస్తువులకు అవగాహన లోపంతో రశీదులు తీసుకోకపోవడంతో ఒక్కోసారి నష్టపోతున్నారని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి చెప్పారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌరసరఫరాల విభాగం ఆధ్వర్యంలో జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. వినియోగదారుల న్యాయ పాలనకు వర్చువల్ విధానం-డిజిటల్ సౌలభ్యం అనే అంశంపై వేడుకలను జరిపారు. వినియోగదారులు ఐఎస్ఐ సర్టిఫైడ్ మార్కింగ్ ఉన్న వస్తువులను కొనుగోలు చేయాలని జేసీ స్పష్టం చేశారు. ఆహారం, ఔషధాల విషయంలో గడువు తేదీని తప్పనిసరిగా పరిశీలించుకోవాలన్నారు. ఇటీవల కాలంలో వినియోగదారుల అభిరుచులు, ఆలోచనలను ప్రభావితం చేస్తూ వ్యాపార సంస్థలు మోసం చేస్తున్నాయని జేసీ తెలిపారు. తగ్గింపు ధరలు, ఒకటి కొంటే ఒకటి ఉచితం అంటూ చేసే ప్రచార మాయలో పడి వినియోగదారులు నష్టపోతున్నారని వివరించారు. వినియోగదారుల ప్రయోజనార్థం, హక్కుల పరిరక్షణ కోసం 1986 డిసెంబరు 24న వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిందని జేసీ తెలిపారు. డీఎస్వో ఉదయభాస్కర్ మాట్లాడుతూ వినియోగదారులను తప్పుడు ప్రకటనలు, సందేశాలతో మోసగించడం పెరిగిపోయిందన్నారు. వాణిజ్య వ్యాపారాల్లో పనిచేసేవారు నిర్లక్ష్యంగా, మోసపూరితంగా వ్యవహరించినప్పుడు తక్కువ సమయంలో తక్కువ రుసుముతో దళారుల ప్రమేయం లేకుండా వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించి సత్వర న్యాయం పొందవచ్చునన్నారు. సైబర్ నేరాల కారణంగా కొత్త చట్టాలను అమలులోకి తీసుకువచ్చారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించగా విజేతలకు జేసీ నిషాంతి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా తూనికలు, కొలతల శాఖ సహాయ నియంత్రణ అధికారి రాజేష్, వినియోగదారుల ఫోరం ప్రతినిధులు అద్దంకి అమరేశ్వరరావు, మాలే శ్రీనివాసనగేష్, బీవీవీ సత్యనారాయణ, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ బాలసరస్వతి, సహాయ మేనేజర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేది తీరంలో మృత డాల్ఫిన్

వార్త..7లో

ముమ్మిడివరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ

7లో

రక్షకుడు ఉదయించినాడు..

- ఆంధ్రజ్యోతి, అమలాపురం టౌన్

నేడే క్రిస్మస్


అమలాపురం మన్నా జూబ్లీ చర్చి ప్రాంగణంలో క్రిస్మస్ సందర్భంగా ఏర్పాటుచేసిన దీపాలంకరణలు



45 అడుగుల క్రిస్మస్ ట్రీ

పెద్దాపురం నుంచి జగ్గంపేట వెళ్లే రోడ్డులో ఉన్న తండ్రీ కుమార పరిశుద్ధాత్మక మినిస్ట్రీస్ ప్రార్థనా మందిరం క్రిస్మస్ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇక్కడ ఏర్పాటుచేసిన 45 అడుగుల క్రిస్మస్ ట్రీ, స్టార్ ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ప్రార్థనా మందిరం నిర్వాహకులు రౌతు సూరిబాబు, పరంజ్యోతి తెలిపారు. - పెద్దాపురం




యానాంలో రోమన్ కేథలిక్ చర్చి

సువార్త...

"భయపడకండి.. ఇదిగో ప్రజలందరికినీ కలుగబోవు మరో సంతోషకరమైన సువార్తమానం చెబుతున్నా.. దావీదు పట్టణంలో నేడు రక్షకుడు మీకొరకు పుట్టియున్నాడు. ఆయనే ప్రభువైన ఏసుక్రీస్తు.."

- లూకా సువార్త 2:10

'నిన్నువలే నీ పొరుగువారిని ప్రేమించు..' అని క్రీస్తు పలికిన చిన్న వాక్యంలో అద్భుతమైన సందేశం ఉంది. దుర్మార్గులను, సన్మార్గులను, పతితులను, పవిత్రులను ఒకే దృష్టితో ప్రేమించగలిగే దివ్య మానసాన్ని ప్రతి ఒక్కరూ ప్రతిష్ఠించుకోవాలని క్రీస్తు చెప్పారు. మానవజాతికి సన్మార్గాన్ని చూపిన ప్రవక్తలెందరో ఉన్నారు.. వారిలో ఏసుక్రీస్తుకు మాత్రం ప్రత్యేక స్థానం ఉంది. ప్రేమ.. కరుణ.. దయలకు ప్రతిరూపంగా ఏసుక్రీస్తు భువిపై మానవ రూపంలో జన్మించారు. ప్రతీ వ్యక్తి తోటివారిని ప్రేమగా చూడాలని.. దయతో క్షమించాలని.. కరుణామయులుగా మెలగాలని మానవజాతికి ఆయన అందించిన శుభసందేశం. అంతటి ప్రేమామయుని జన్మదినమంటే ఎందరికో పండుగే మరి. ఏసుక్రీస్తు బోధనలను ప్రతి వ్యక్తి తనతో అన్వయించుకుని జీవిస్తే జగమంతా ప్రేమమయమే. పాపం చేసినవారికి శిక్ష విధించడం కాదు పాపమే మరణించాలని ఏసుక్రీస్తు పలికారు. సమస్త మానవాళి పాప పరిహారార్థం దేవుడు నరుడిగా జన్మించిన పవిత్రమైన రోజు క్రిస్మస్. సంపూర్ణ మానవత్వమే మనిషిని మహా పురుషుడిగా, దైవ స్వరూపుడిగా మారుస్తుంది. ఇదే క్రిస్మస్ పర్వదినం ద్వారా సమస్త మానవాళికి అందించే శుభసందేశం.

నిత్య సంతోషమును అనుగ్రహించె క్రీస్తు



ఫిలిప్పీయులకు అందించిన సువార్తలో ఎల్లప్పుడూ ప్రభువునందు ఆనందించుడి అన్న వాక్యాన్ని మరల మరలా గుర్తించాలి. ఐహిక విచారము నుంచి విడిపించి నీయందు నిరీక్షణతో వచ్చే సంతోషము అనుగ్రహించమని ఆ దేవాది దేవుడిని వేడుకోవాలి. ఈ లోక మాలిన్యమును తొలగించి నన్ను సరిచేయమని వేడుకుని నీ హృదయాన్ని పోలిన మనస్సు నాకు దయచేయండి అని రోమా 12:2 చెబుతుంది. నీ నీతి అనే వస్త్రాన్ని నాకు ధరింపచేసి నీతిని అనుసరించు వ్యక్తిగా సమాధానము కోరి దానిని వెంటాడు వ్యక్తిగా నన్ను చేయమని రోమా 14:17 చెబుతుంది. **- రెవ కేకే పాల్, సెయింట్ లూథరన్ చర్చ్, అమలాపురం**

పాపముల నుంచి రక్షించే ఏసు



భయపడకండి ఇదిగో ప్రజలందరికినీ కలగబోవు మహా సంతోషకరమైన సువర్తమానమును నేను మీకు తెలియచేయుచున్నాను. దావీదు పట్టణమునందు నేడు రక్షకుడు మీ కొరకు పుట్టియున్నాడు. ఆయనే ప్రభువైన ఏసుక్రీస్తు అని లూకా రెండవ అధ్యాయం పదవ వచనం చెబుతుంది. ఏసుకృప, సత్య, సంపూర్ణుడిగా మన మధ్యలో నివశించడం యెహోవా కృప.

- రెవ.ఎర్నెస్ట్ తాతపూడి, ఎస్తేరుజ్యోతి తాతపూడి, అమలాపురం

దేవుడే నరుడై జన్మించినరోజు



సర్వలోక రక్షణ కొరకు దేవుడే నరుడై జన్మించిన రోజు క్రిస్మస్. సృష్టి ఆదియందు వాక్యముగా ఉన్నవాడు శరీరధారిగా ఏసుక్రీస్తుగా జన్మించెను. తాను నిర్మించిన మానవజాతి దేవుని చిత్తమునకు దూరమై వారి ఆత్మీయ రూపాన్ని పోగొట్టుకొనుచుండగా తిరిగి వారిలో ఆత్మీయ రూపాన్ని ఎరకపరిచే నిమిత్తం ఏసుక్రీస్తు భువిపై జన్మించెను(యోహాను 1:14, హెబ్రి 1:14,15). మానవాళి కొరకు ఎన్నో కార్యాలు జరిపించేందుకు క్రీస్తు మానవావతారునిగా జన్మించినట్టు(యోహాను 3:16) బైబిల్ చెబుతుంది. **- రెవ.కార్ల్‌డేవిడ్ కొమానపల్లి, మన్నాజూబ్లీ చర్చ్, అమలాపురం**



పోప్ జాన్‌పాల్-2 జ్ఞాపకార్థం కాంగో డెమొక్రటిక్ రిపబ్లిక్ దేశం 25 ఫ్రాంకుల నాణేన్ని విడుదల చేసింది. యాక్రిలిక్ పదార్థంతో తయారుచేయడం వల్ల ఆ నాణెం పారదర్శకంగా ఉంటుంది. 140 మిల్లీమీటర్ల వ్యాసం కలిగిన నాణెం బరువు కిలో ఉంది. ప్రపంచవ్యాప్తంగా కేవలం 401 నాణేలను మాత్రమే ముద్రించారు. అరుదైన ఈ నాణేన్ని అమలాపురం భూపయ్య అగ్రహారానికి చెందిన నాణేల సేకరణకర్త పుత్సా కృష్ణకామశ్వర్ సేకరించారు.

- అమలాపురం టౌన్

చర్చిలన్నీ ముస్తాబు!

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో క్రిస్మస్ వేడుకలకు సిద్ధమైన క్రైస్తవులు


కాకినాడ రామారావుపేటలోని ఇమ్మాన్యుయేల్ బాప్టిస్టు చర్చి


కాకినాడలోని హౌస్ ఆఫ్ ప్రేయర్



కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా క్రిస్మస్ సందడి మొదలైంది. డిసెంబరు మాసం మొదటి నుంచి క్రైస్తవ వేడుకలు నిర్వహించుకుంటున్నారు. డిసెంబరు 25న ప్రపంచమంతా జరుపుకుంటున్న క్రిస్మస్ క్రైస్తవులకు అతిపెద్ద పండుగ కావడంతో బుధవారం చర్చిల్లో ఘనంగా జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో క్రీస్తు విశ్వాసులతోపాటు మిషనరీలు బలంగా పనిచేస్తుండడంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం వంటి జిల్లా కేంద్రాలతోపాటు నగరాలు, గ్రామాల్లో క్రిస్మస్‌ను ఘనంగా జరుపుకుంటారు. ఇప్పటికే పండుగ నిర్వాహణకు అవసరమైన కొనుగోళ్ల కోసం క్రీస్తు విశ్వాసులు దుకాణాలను సందర్శిస్తుండడంతో పట్టణాల్లో వీధులు, దుకాణాలు రద్దీగా మారుతున్నాయి. క్రిస్మస్ పండుగ సమీపిస్తుండగానే ఏసు ప్రభువు లోకానికి వచ్చాడన్న సందేశం చాటుతూ క్రైస్తవులు ఇళ్ల మీద క్రిస్మస్ తారను వేలాడదీయడం ఆనవాయితీ. నక్షత్రాన్ని పోలిన ఆకృతిలో లైటింగ్ ఏర్పాటు చేసి ఇంటిపై అలంకరిస్తారు. వాటి కొనుగోళ్లతోపాటు పండుగలో ప్రధాన భూమిక పోషించే క్రిస్మస్ ట్రీ, శాంతాక్లాస్ వేషధారణలపై చిన్నారులు ఆసక్తి చూపుతున్నారు. ఎర్రని దుస్తులు, తెల్లని గడ్డం, పొడవు టోపీ ఆసక్తికరంగా ఉండే క్రిస్మస్ తాత వేషం ధరించడం క్రిస్మస్ సంబరాల్లో ఒకటి కావడంతో నగరంలో వీటి విక్రయాలు జరుగుతున్నాయి. వీటితోపాటు పండుగ నాడు అవసరమయ్యే కేకులను, స్వీట్లను ఆర్డర్లు చేస్తుండడంతో స్వీట్ దుకాణాలు కళకళాడుతున్నాయి. పిండి వంటల కోసం సామగ్రిని కొనుగోలు చేస్తున్నారు. కాగా మరోపక్క విద్యాలయాలు, తదితర చోట్ల సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహిస్తున్నారు. అదేవిధంగా అన్ని క్రైస్తవ మిషనరీలు, వసతి గృహాలు, చర్చిలను సర్వాంగ సుందరంగా అలంకరించారు.

కారుణ్య నియామకాలు త్వరితగతిన చేపట్టాలి


జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

కాకినాడ రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ పరిధిలోని పాఠశాలల్లో పనిచేస్తూ చనిపోయిన ఉద్యోగ, ఉపాధ్యాయుల కుటుంబ సభ్యులకు త్వరితగతిన కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరుతూ కాకినాడ జిల్లా ఎస్టీయూ పక్షాన జిల్లా అధ్యక్షుడు మోర్త శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకు వినతిపత్రం అందజేశారు. రెండేళ్ల నుంచి ఇప్పటివరకు ఉద్యోగ, ఉపాధ్యాయ కుటుంబీకులు 91 మంది కారుణ్య నియామకాలకు దరఖాస్తు చేశారన్నారు. జాప్యం వల్ల వారి కుటుంబ సభ్యుల ఆర్థిక, మానసిక ఇబ్బందుల దృష్ట్యా సూపర్ న్యూమరరీ పోస్టులను సృష్టించి త్వరితగతిన పోస్టింగ్ ఇవ్వాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి కె.కాశీవిశ్వనాథ్, రాష్ట్ర కార్యదర్శి యు.శ్రీను, వెంకటేశ్వరరావు, రామకృష్ణ, కృష్ణంరాజు, పి.శ్రీను. రామ్‌తేజ, మహేష్, శ్రీకాంత్ తదితరులు వున్నారు.

భవనం సమస్య పరిష్కారానికి వినతి

కాకినాడ సిటీ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘ భవనంపై తలెత్తిన సమస్యను పరిష్కరించాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఎన్జీవో సంఘ నాయకులు మంగళవారం జాయింట్ కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహనరావు ఆధ్వర్యంలో జేసీ రాహుల్ మీనాను కలిసి వినతిపత్రం సమర్పించారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరిస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకట కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా సహాధ్యక్షుడు పాలపర్తి మూర్తిబాబు, కాకినాడ తాలూకా యూనిట్ అధ్యక్షుడు సత్తిరాజు, ఉమ్మడి జిల్లా నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘ అధ్యక్ష కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఉమ్మడి జిల్లా ఎన్జీవో సంఘ నాయకులు

ఉపాధి హామీలో వ్యవసాయానికి ప్రాధాన్యం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

లక్ష్యం మేరకు ఉపాధి పనులు చేపట్టాలి
లేకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవు
అధికారులకు అల్లూరి జిల్లా కలెక్టర్ హెచ్చరిక
చింతపల్లి, హుకుంపేట, వీఆర్ పురం ఎంపీడీవోలకు షోకాజ్ నోటీసులు

పాడేరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకంలో వ్యవసాయానుబంధ రంగాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలపై వివిధ శాఖల అధికారులతో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జాబ్ కార్డులున్న ప్రతి కుటుంబానికి ఉపాధి పనులు కల్పించాలని, ముఖ్యంగా వ్యవసాయానుబంధ రంగాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అలాగే ప్రతి మండలంలో వంద పంట కుంటలను నిర్మించాలన్నారు. లక్ష్యం మేరకు ఉపాధి పనులు చేపట్టాలని, లేకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు పోషకాహారం సక్రమంగా అందించాలని, బలహీనంగా ఉన్న చిన్నారులపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. ఎంపీడీవోలు విధిగా అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీలు చేయాలని, గ్రామాల్లో బాల్య వివాహాల నిర్మూలనకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో గృహ నిర్మాణాలను సకాలంలో పూర్తి చేసేందుకు హౌసింగ్ అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. జిల్లాలో వివిధ పథకాల లబ్ధిదారుల వివరాలను నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ వెబ్‌సైట్‌లో నమోదు చేయని చింతపల్లి, హుకుంపేట, వీఆర్ పురం ఎంపీడీవోలకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నామని కలెక్టర్ దినేశ్‌కుమార్ పేర్కొన్నారు. లబ్ధిదారుల వివరాలను నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్‌లో నమోదు చేయకపోతే ఆయా లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు వర్తించని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఈ విషయంలో ఎంపీడీవోలు అశ్రద్ధగా వ్యవహరించవద్దని కలెక్టర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పీవోలు అభిషేక్, సింహాచలం, అపూర్వభరత్, సబ్ కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు, 22 మండలాలకు చెందిన ఎంపీడీవోలు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో శత చండీ మహా యాగం


మహా రుద్ర సహిత శత చండీ మహా యాగంలో పాల్గొన్న భక్తులు

పిఠాపురం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బైపాస్ రోడ్డులో గల సద్గురు గోపాల్‌బాబా ఆశ్రమంలో నిర్వహిస్తున్న శ్రీ మహా రుద్ర సహిత శత చండీ మహాయాగం మంగళవారం రెండో రోజుకి చేరుకుంది. 108 యజ్ఞ కుండాలతో 116 మంది రుత్విక్కుల మంత్రోచ్చారణల మధ్య యాగ క్రతువును భక్త దంపతులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. లోక కల్యాణం, విశ్వశాంతి, ధర్మపరిరక్షణ, రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, ఆది పరాశక్తి అనుగ్రహం ఈ నేలపై ఉండాలని శ్రీసన్నిధి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో జరుగుతున్న మహా యాగంలో 50 మంది మహాసిద్ధ గురువులు, యోగులు, నాగ సాధువులు పాల్గొని భక్తులకు ఆశీస్సులు అందజేశారు.

ఉప్పాడ తీరంలో అలల ఉధృతి

ఈదురుగాలులతో ఉప్పొంగుతున్న సముద్రం

కొత్తపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తీరంలో వీస్తున్న ఈదురుగాలులకు సముద్రం ఉప్పొంగుతోంది. మంగళవారం సాయంత్రం నుంచి తీరం వెంబడి బలమైన ఈదురుగాలులు వీస్తున్నాయి. సముద్రం లోపలి నుంచి ఒడ్డుకు బలంగా గాలులు వీచడంతో సముద్రం ఉబ్బెత్తుగా మారుతోంది. కెరటాలు ఉవ్వెత్తున లేస్తున్నాయి. అలల తీవ్రతకు అమీనబాద్ సమీపంలోని పెట్రోలు బంకు ఎదురుగా ఉన్న పంట పొలాల్లోకి సముద్రం నీరు ప్రవేశిస్తోంది. వరుస తుపాన్లతో తీర ప్రాంత మత్స్యకారులు ఉపాధి లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.




హైకోర్టు జడ్జి మన్మథరావు నుంచి పురస్కారం అందుకుంటున్న సీతాపతిరావు

సీతాపతిరావుకు జీవిత సాఫల్య పురస్కారం

కాకినాడ రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్‌కు చెందిన నేషనల్ అసోసియేషన్ ఆఫ్ ట్యాక్స్ బార్ అసోసియేషన్, ఏఐఎఫ్‌టీపీ, లోకల్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ తిరుపతిలో నిర్వహించిన సెమినార్‌లో ఏపీ హైకోర్టు జడ్జి డాక్టర్ కె.మన్మథరావు నుంచి బీఎస్ తిరుపతిరావు జీవిత సాఫల్య పురస్కారం అందుకున్నారు. ఈయన జీఎస్టీ చట్టంలోని వివిధ అంశాలపై 500 వ్యాసాలు రచించారు. సేవలకు గుర్తింపుగా 74, 75 గణతంత్ర వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ సేవా ప్రశంసాపత్రాలను కలెక్టర్ నుంచి అందుకున్నారు. వృత్తి నిపుణులకు సుమారు 200 సెమినార్లు, 175 శిక్షణా తరగతులు, సుమారు 500 మంది విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ఇచ్చారు. తిరుపతిరావును కాకినాడ ఐడియల్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవినీకుమారి, ప్రిన్సిపాల్ డాక్టర్ టి.సత్యనారాయణ, అధ్యాపకులు అభినందించారు.

28న కాకినాడ ఐటీఐలో మినీ జాబ్‌మేళా

కార్పొరేషన్ (కాకినాడ), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి సంస్థ, గవర్నమెంట్ ఐటీఐ ఆధ్వర్యంలో ఈ నెల 28న కాకినాడ గవర్నమెంట్ ఐటీఐ కాలేజీలో మినీ జాబ్ మేళా నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి సంస్థ అధికారి శ్రీనివాస్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు, ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం.వేణుగోపాలవర్మ తెలిపారు. ప్రముఖ కంపెనీలు హాజరవుతాయన్నారు. టెన్త్, ఇంటర్, ఏదైనా డిగ్రీ పూర్తి చేసి 18-35 సంవత్సరాల వయసు గల వారు అర్హులన్నారు.



సత్యదేవుడి వ్రతమాచరిస్తున్న జిల్లా ఎస్పీ, కలెక్టర్ దంపతులు

సత్యదేవుడి సన్నిధిలో ప్రముఖుల పూజలు

● వ్రతమాచరించిన కలెక్టర్, ఎస్పీ, దంపతులు

అన్నవరం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వారిద్దరూ జిల్లా యంత్రాంగాన్ని నడిపించే అధిపతులు సహజంగా పలు పర్యాయాలు ఇద్దరూ ఒకే వేదికను పంచుకుంటుంటారు. వారిద్దరూ కుటుంబంతో ఒకే ఫ్రేమ్‌లో కనపడడం అరుదుగా ఉంటుంది. మంగళవారం వారిరువురి దంపతులు సత్యదేవుడి వ్రతమాచరించారు. వారే జిల్లా కలెక్టర్ షాన్ మోహన్, ఎస్పీ విక్రాంత్ పాటిల్ మంగళవారం వారిరువురు కుటుంబసభ్యులతో స్వామివారి వ్రతమాచరించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఎస్పీ, కలెక్టర్ దంపతులకు ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్‌లు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్వో కృష్ణారావు, ఏఈవో కొండలరావు, ప్రత్తిపాడు సీఐ సూరి అప్పారావు, అన్నవరం ఎస్.ఐ. హరిబాబు తదితరులు ఉన్నారు.

ఏడీబీ రోడ్డు విస్తరణ పనుల పరిశీలన



ఏడీబీ రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నుంచి పెద్దాపురం, సామర్లకోట మీదుగా కాకినాడపోర్టు వరకు చేపడుతున్న ఏడీబీ రోడ్డు విస్తరణ పనులను మంగళవారం కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలలలోపే రహదారి విస్తరణ పనులు చేపట్టామన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ల నిరంతర పర్యవేక్షణలో పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రోడ్డు విస్తరణ పనులను గాలికి వదిలేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. రోడ్డు విస్తరణ పనులను నాణ్యతతో రాజీ లేకుండా త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

జీజీహెచ్‌లో మానసిక రోగి

ఆత్మహత్యాయత్నం

● విషమంగా విశాలాక్షి ఆరోగ్యం



కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరిస్తున్న మానసిక వైద్యులు

జీజీహెచ్ (కాకినాడ), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఓ మానసిక రోగి బట్టలకు నిప్పు అట్టించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కాకినాడజిల్లా రూరల్ మండలం కొవ్వాడ గ్రామానికి చెందిన 33 ఏళ్ల గొల్లపల్లి విశాలాక్షికి తండ్రి గణపతిరావ్, తల్లి చిట్టి మాణిక్యం ఉన్నారు. కాగా ఆమె పదేళ్లక్రితం డిగ్రీ పాసై టెట్‌కు ప్రిపేర్ అయ్యింది. ఆ సమయంలో ఆమెకు మెదడులో కణితి ఏర్పడి ఆమె మానసిక ప్రవర్తనలో తేడా వచ్చింది. దాంతో కుటుంబీకులు కాకినాడలోని ఓ ప్రైవేటు మానసిక ఆసుపత్రిలో చూపించారు. అనంతరం ఆమెకు విశాఖపట్నంలో మెరుగైన వైద్యం అందుతుండడంతో ఆమె ఆరోగ్యం కుదుటబడింది. 2022 నుంచి అక్కడ మందులనే వాడుతుంది. ఆమెకు గత 2 నెలల నుంచి విశాలాక్షి మానసిక ప్రవర్తన అసలు బాగుండకపోవడం, అరుపులు, కేక లు వేయడం, అందరినీ కొట్టడం చేస్తుండడంతో కుటుంబీకులు 15 రోజుల క్రితం కాకినాడ జీజీహెచ్‌లోను సైకియాట్రీ వార్డులో చేర్పించారు. ఆమెలో విపరీత ప్రవర్తన ఉండ డంతో ఆమెను ఫిమేల్ సెల్‌లో ఉంచి ఆమెకు వైద్యులు చికిత్సను అందజేస్తున్నారు. ఈ క్రమంలో ఆమె అందరినీ కొడుతుండడంతో మంగళవారం ఆమెను లోపల ఉంచి గెడపెట్టి బయట ఆమె తల్లిదండ్రులు ఉన్నారు. విశాలాక్షికి ఇంజక్షన్ టైం అవ్వడంతో వారిరువురు నర్సు దగ్గరకు వెళ్లారు. ఆ సమయంలో విశాలాక్షి హాహాకారాలు చేస్తుండడం విని అక్కడకు వెళ్లి చూడగా లోపల నుంచి మంటలు రావడాన్ని గమనించారు. తలుపుతీసి చూడగా కూతురు కాలిపోతుండడాన్ని ఆ తల్లిదండ్రులు గమనించారు. అనంతరం అక్కడికి సైకియాట్రీ హెచ్‌వోడి డాక్టర్ రామచంద్రరావ్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వరప్రసాద్ చేరుకుని విశాలాక్షి 70 శాతం కాలిపోయిందని గుర్తించి ఆమెను అక్కడినుంచి బర్న్స్ వార్డుకు తరలించి ప్రత్యేక వైద్య చికిత్స అందజేస్తున్నారు. దోమల చక్రం వెలిగించుకునేందుకు అక్కడ పెట్టిన అగ్గి పెట్టితో ఆమె గౌన్‌కు నిప్పు అంటించుకున్నట్లు డాక్టర్ రామచంద్రరావ్ తెలిపారు. విశాలాక్షి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ

● సబ్‌రిజిస్ట్రార్ సెలవుపై ఆగ్రహం

ముమ్మిడివరం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మమ్మిడివరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ శివరామ్ మంగళవారం సాయంత్రం తనిఖీ నిర్వహించారు. భూముల మార్కెట్ విలువ పెంపుదల భాగాల్లో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి శివరామ్ వచ్చిన సమయంలో సబ్‌రిజిస్ట్రార్ లేకపోవడంతో సిబ్బందిపై మండిపడ్డారు. సబ్‌రిజిస్ట్రార్ సెలవు పెట్టారని సిబ్బంది చెప్పడంతో ఆగ్రహం వ్యక్తంచేసి జిల్లా రిజిస్ట్రార్‌కు ఫోన్‌చేసి అడిగారు. జనవరి ఒకటి నుంచి భూమివిలువల పెంపు నేపథ్యంలో సబ్‌రిజిస్ట్రార్లకు సెలవు ఇవ్వరాదని ఆదేశాలు ఉన్నప్పటికీ మీరు సెలవు ఎలా ఇచ్చారని జి ల్లా రిజిస్ట్రార్‌పై శివరామ్ ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. సబ్ రిజిస్ట్రార్ సెలవు విషయం తనకు తెలియదని జిల్లా రిజిస్ట్రార్ చెప్పడంతో సబ్‌రిజిస్ట్రార్ నుంచి లిఖితపూర్వక వివరణ కోరాలని ఆదేశించారు.

డాక్టర్ అంబేడ్కర్‌ను గౌరవించే పార్టీ బీజేపీ

● రాష్ట్రంలో 25 లక్షల సభ్యత్వాలు నమోదు సంతోషకరం

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

రాజమహేంద్రవరంఅర్బన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అమితంగా గౌరవించే పార్టీ బీజేపీ అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. రాజమహేంద్రవరంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. అంబేడ్కర్ తమ నాయకుడు అని అనేకసార్లు గొప్పగా చెప్పుకున్న కాంగ్రెస్ పార్టీ ఆయన్ను రెండుసార్లు ఎన్నికల్లో ఘోరంగా ఓడించి పార్లమెంట్‌లో అడుగు కూడా పెట్టనీయలేదన్నారు. బీజేపీకి రాజ్యాంగాన్ని ఉల్లంఘించడం కానీ, రాజ్యాంగాన్ని మార్చాలనే భావన కానీ ఏనాడూ లేదన్నారు. ఆర్టికల్ 356ను కాంగ్రెస్ దుర్వినియోగం చేసిందని, అశేష ప్రజాదరణ కల్గిన ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని అప్రజాస్వామికంగా రద్దు చేసిన తర్వాత ఆంధ్రప్రజల అభిమానం కారణంగా ఒత్తిడి రావడంతో మళ్లీ ఎన్టీఆర్‌కు పట్టం కట్టారని చరిత్ర దీనికి సాక్ష్యం అని అన్నారు. రాజమండ్రి రైల్వేస్టేషన్ ఆధునీకరణ విషయంలో రీ డిజైన్ చేయడంవల్ల కొంత వ్యయం పెరిగే అవకాశం ఉందని, ప్రతిపాదనలన్నీ రైల్వే బోర్డుకు వెళ్లాయన్నారు. కొవిడ్‌కు ముందు కొవ్వూరు, నిడదవోలు స్టేషన్లలో కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపేజీ తొలగించారని, దీన్ని పునరుద్ధరించేందుకు రెండుసార్లు కేంద్ర రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిశానన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో మూడు పార్టీల పొత్తులో ఉన్న నేపథ్యంలో నామినేటెడ్ పదవుల షేరింగ్ ప్యాటర్న్‌కు అనుగుణంగానే తమ వారికి పదవులు ఇచ్చారన్నారు. తాను రాజమండ్రికే పరిమితం కాదు, పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలిగా రాష్ట్రం అంతా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉందన్నారు. ఈ విషయం మా కార్యకర్తలకు అందరికీ బాగా తెలుసు అన్నారు. రాష్ట్రంలో టూరిజం అభివృద్ధి జరిగితే యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. జిల్లాలో 184 కిలోమీటర్ల పొడవైన ఎర్రకాలువకు సంబంధించిన ఆధునికీకరణపై కలెక్టర్‌ను డీపీఆర్ కోరామన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యంవల్లే టిడ్కో గృహాలు శిథిలావస్థకు చేరాయని అన్నారు. దివంగత వాజ్‌పేయి కల నిజం చేస్తూ రాష్ట్రంలో 25 లక్షల సభ్యత్వాలు నమోదు చేశామన్నారు. మీడియా సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

29న రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పోటీలు

రాజానగరం/రంగంపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆదర్శ రైతు దివంగత గన్ని సత్యనారాయణమూర్తి స్మారక 6వ వార్షిక రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పోటీలను ఈ నెల 29న రంగంపేట మండలం వడిశలేరు వద్ద నిర్వహిస్తున్నట్టు జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు మంగళవారం తెలిపారు. మానవాళి మనుగడకు మూలాధారమైన వ్యవసాయదారులు, పశుసంపదను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఏడీబీ రోడ్డుకు ఆనుకుని ఉన్న గన్నివారి తోటలో ఆ రోజు ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఈ పోటీలు ప్రారంభమవుతాయని చెప్పారు.. సీనియర్, జూనియర్ విభాగాల్లో ఆరుగురు విజేతలకు ఆరు మోటార్ సైకిళ్లు, ప్రథమ బహుమతిగా రాయల్ ఎన్‌ఫీల్డ్, ద్వితీయ, తృతీయ బహుమతులుగా హోండా షైన్ బైకులు, అలాగే 75 కన్సోలేషన్ బహుమతులు అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు బొప్పన బ్రహ్మాజీరావు, కూటి కోటేశ్వరరావు మొబైల్ నెంబర్లు 98481 87368; 90006 62999ను సంప్రదించవచ్చన్నారు.

రుడాలో ఫైల్స్ త్వరగా క్లియర్ చేయండి

● రుడా తొలి సమీక్షలో చైర్మన్ బీవీఆర్ ఆదేశం

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రుడా పరిధిలో ఇప్పటికే దరఖాస్తులు చేసుకున్న ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఫైల్స్ త్వరగా క్లియర్ చేయాలని చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి సూచించారు. రుడా కార్యాలయంలో మంగళవారం రుడా వీసీ ,కార్పొరేషన్ కమిషనర్ కేతన్‌గార్గ్‌తో కలిసి ప్లానింగ్ అధికారులతో ఆయన తొలి సమీక్ష నిర్వహించారు. రుడా నిధులతో జరుగుతున్న పనులు, ఇంజనీరింగ్ వర్కులు, ప్లానింగ్ విభాగంలో మాస్టర్ ప్లాన్లు, ఎల్ఆర్ఎస్, ఏపీడీపీఎంఎస్ ఫైల్స్‌పై చర్చించారు. త్వరలో రుడా పరిధిలోని నియోజకవర్గాల వారీగా ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని బొడ్డు వెంకటరమణ చౌదరి స్పష్టం చేశారు.



రుడా సమీక్ష సమావేశంలో చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, వీసీ కేతన్‌గార్గ్

హోరాహోరీగా సాగిన కబడ్డీ పోటీలు

● బాలికల విభాగంలో విజేతగా నిలిచిన శ్రీకాకుళం జట్టు

● ద్వితీయ స్థానం విజయనగరం జట్టు ● ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్

● విజేతలకు బహుమతులు అందజేత ● ఫైనల్‌కు చేరిన బాలుర జట్లు

రావులపాలెం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రావులపాలెం సీఆర్సీ క్రీడాప్రాంగణంలో ఆంధ్రా కబడ్డీ అసోషియేషన్, సీఆర్సీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 50వ రాష్ట్రస్థాయి బాలుర, బాలికల జూనియర్ కబడ్డీ ఛాంపియన్ షిప్ పోటీలు మూడో రోజు మంగళవారం బాలికల విభాగం జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఫైనల్‌కు చేరిన శ్రీకాకుళం, విజయనగరం బాలికల జట్ల మధ్య జరిగిన కబడ్డీ పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. శ్రీకాకుళం జట్టు ప్రథమ స్థానంలో నిలవగా, విజయనగరం జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. మూడో స్థానంగా కృష్ణ, విశాఖపట్నం జట్లు నిలిచాయి. ఈ మ్యాచ్ ప్రారంభం నుంచి ముగిసే వరకూ నువ్వానేనా అన్న విధంగా సాగడంతో క్రీడాభిమానులు ఆశక్తిగా వీక్షించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో విజేతలకు ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు గొలుగూరి వెంకటరెడ్డి, కార్యదర్శి యలమించిలి శ్రీకాంత్, సీఆర్సీ అధ్యక్షులు తాడి నాగమోహన్‌రెడ్డి, కార్యదర్శి కర్రి అశోక్‌రెడ్డి, స్పోర్ట్స్ డైరెక్టర్ వీరరాఘవరెడ్డి, అంజనీకుమార్‌రెడ్డితో పాటు పలువురు విజేతలకు కప్, బహుమతులను అందజేశారు. అదేవిధంగా బాలుర విభాగానికి సంబంధించి శ్రీకాకుళం, విజనగరం జట్లు ఫైనల్స్‌కు చేరాయి.





ప్రథమ స్థానం సాధించిన శ్రీకాకుళం జట్టు, ద్వితీయ స్థానంలో నిలిచిన విజయనగరం బాలికల జట్టుకు బహుమతులు అందిస్తున్న దృశ్యం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జేసీ రాహుల్ మీనా

వినియోగదారుల వివాదాల

సత్వర పరిష్కారానికి కమిషన్ దోహదం

● కాకినాడ జిల్లా జేసీ రాహుల్ మీనా

సర్పవరం జంక్షన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, వినియోగదారుల హక్కులు, రక్షణ, వివాదాల పరిష్కారానికి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక న్యాయ సంస్థలను సద్వినియోగం చేసుకోవాలని కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా కోరారు. సోమవారం వాకలపూడి ప్యారీ షుగర్ ప్యాక్టరీలో మైత్రి ఉమెన్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు, డీసీడీఆర్సీ సభ్యురాలు సీహెచ్ సుశీ, జిల్లా వినియోగదారుల సమాచార సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ (ఎన్‌సీడీఆర్సీ) అవగాహన సదస్సులో జేసీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల రక్షణ చట్టం ప్రకారం వినియోగదారుల హక్కులకు భంగం వాటిల్లితే సత్వర న్యాయం కోసం వినియోగదారుల వివాదాల సత్వర పరిష్కారం కోసం రాష్ట్రంలో వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ఏర్పాటు చేశారన్నారు. వస్తువులు, సేవలు, విలువల లోపాలు, భంగం వాటిల్లితే రూ.10నుంచి రూ50 లక్షల వరకు సంబంధిత కంపెనీ నుంచి పరిహారం పొందే వెసులుబాటు ఉందన్నారు. వివాదాల సత్వర పరిష్కారం కోసం జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పాక్షిక న్యాయ సంస్థలు ఏర్పాటు చేశారన్నారు. వస్తు, సేవల్లో లోపం జరిగితే ఇంటి వద్ద నుంచే వర్చువల్ విధానంలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ-కామర్స్ ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన వస్తువుల సేవలు, నాణ్యతలో లోపాలుంటే కమిషన్‌కు ఫిర్యాదు చేసి న్యాయం పొందవచ్చన్నారు. వినియోగదారుల హక్కులను పరిరక్షించడంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న పాత్ర, సంబంధిత విభాగాలు, వినియోగదారుల వివాదాల సత్వర పరిష్కార కమిషన్‌పై డీఎస్‌వో టి. ప్రసన్నలక్ష్మీదేవి, డీసీడీఆర్సీ కాకినాడ ప్రెసిడెంట్ చెరుకూరి రఘుపతి వసంతకుమార్, సభ్యులు సీహెచ్ సుశీ, సీహెచ్ నాగేశ్వరరావు అవగాహన కల్పించారు. జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ పోస్టర్‌ని జేసీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్యారీ షుగర్స్ రిఫైనరీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ వి.రామసుబ్రమణియన్, డీసీడీఆర్సీ కన్వీనర్, అడ్వైజర్ భమిడి శివ ఎస్ఎస్ఎన్ మూర్తి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సరిహద్దులో నాటు సారా స్థావరాలపై..

ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారుల దాడులు

● 200 లీటర్ల నాటుసారా స్వాధీనం

● 18500 బెల్లం ఊట ధ్వంసం

● సారా డ్రమ్ములకు నిప్పు

ఎటపాక, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సరిహద్దు ప్రాంతం ఎటపాక మండలంలోని గుండు వారిగూడెం, పిచ్చుకలపాడు గ్రామాల్లో మంగళవారం రెండు తెలుగు రాష్ట్రాల ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు, పోలీసులు సంయుక్తంగా నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఇంటర్ స్టేట్ బోర్డర్స్ నాటుసారా నిర్మూలనలో భాగంగా ఆంధ్ర, తెలంగాణ ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు, పోలీస్, సీఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో సంయుక్తంగా దాడులు జరిపారు. దాడుల్లో ఈరెండు గ్రామాల పరిధిలో 180 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. 18,500 లీటర్లు నాటుసారాకు ఉపయోగించే బెల్లం ఊటను ధ్వంసం చేశారు. బెల్లం ఊటకు వినియోగించే 100 డ్రమ్ములను స్వాధీనం చేసుకుని, వాటికి నిప్పటించారు. గ్రామాల్లో నాటు సారా తయారీకి, రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఆదేనుసారం ఈఎస్, ఎస్టీఎఫ్ సింగంశెట్టి మధు, తెలంగాణలోని ఉమ్మడి ఖమ్మంజిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ జి.గణేష్ నేతృత్వంలో దాడులు జరిపారు. కార్యక్రమంలో రెండు రాష్ట్రాల ఎక్సైజ్, ప్రొహిబిషన్, పోలీసులు, సీఆర్‌పీ ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.





సారాను, డ్రమ్ములను చూపుతున్న ఎక్సైజ్, ప్రొహిబిషన్ అధికారులు, డ్రమ్ములకు నిప్పంటిస్తున్న దృశ్యం

అంతర్వేది తీరంలో

డాల్ఫిన్ మృతి



అంతర్వేది తీరంలో మృతి చెందిన డాల్ఫిన్

అంతర్వేది, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది సముద్ర తీరంలో తరుచూ డాల్ఫిన్లు ఒడ్డుకు వసున్నాయి. రెండు రోజులుగా ఒక డాల్ఫిన్ అంతర్వేది సముద్ర కెరటాల తాకిడికి ఒడ్డుకు రావడంతో స్థానికులు డాల్ఫిన్‌ను చూసి కాపాడే ప్రయత్నం చేశారు. సముద్రం లోపలకు వెళ్లి డాల్ఫిన్‌ను వదిలారు. మంగళవారం ఆ డాల్ఫిన్ తిరిగి ఒడ్డుకు చేరి మృతి చెందింది. గతంలో సముద్ర తీరంలో పెద్ద పెద్ద తాబేళ్లు, భారీ చేపలు, డాల్ఫిన్లు మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. సముద్రంలో బలమైన గాయాలపాలై నీటిలో ఈదుకుంటూ ప్రాణాపాయస్థితిలో ఉన్న తాబేళ్లు, డాల్ఫిన్లు, చేపలు సముద్ర తీర ప్రాంతానికి చేరి మృతి చెందుతున్నాయి.

ఏజెన్సీ తహశీల్దారు శ్రీనివాసరావుపై

కోర్టు ధిక్కారణ కేసు

● రేపు హాజరు కావాలని నోటీసు జారీ చేసిన హైకోర్టు

రంపచోడవరం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఏజెన్సీ లోని తహశీల్దారు చిన్నం శ్రీనివాసరావుపై రాష్ట్ర హైకోర్టులో నమోదైన కోర్టు ధిక్కార కేసులో ఈనెల 26న హాజరుకావాలని హైకోర్టు నోటీసు జారీ చేసింది. గిరిజన భూమి బదలాయింపు కేసులో తీర్పును అమలు చేయాలంటూ రెండు వేర్వేరు పార్టీలు రెండు వేర్వేరు కేసులు దాఖలు చేయగా, వాటిపై ఈ సంవత్సరం మార్చిలో హైకోర్టు ఉమ్మడిగా తీర్పు చెప్పి, మూడునెలలోగా తగుచర్యలు తీసుకోవాలని అడ్డతీగల తహశీల్దారుకు ఉత్తర్వులు జారీ చేసింది. కానీ తహశీల్దారు పని చేసిన చిన్నం శ్రీనివాసరావు సదరు హైకోర్టు తీర్పును అమలు చేయలేదంటూ హైకోర్టులో కోర్టు ధిక్కారణ కేసు నమోదైంది. గతంలో అడ్డతీగల తహశీల్దారుగా పనిచేసిన సదరు శ్రీనివాసరావు ప్రస్తుతం గంగవరం మండల తహశీల్దారుగా పనిచేస్తున్నారు.

వేర్వేరు చోట్ల వెయ్యి గ్రాముల వెండి వస్తువుల అపహరణ

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం త్రీటౌన్ పరిధిలో వేర్వేరు చోట్ల జరిగిన దొంగతనాలలో వెయ్యి గ్రాముల వెండి వస్తువులు అపహరించినట్లు పోలీసులు తెలిపారు. త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే రాజమహేంద్రవరం రంగ్రీజుపేటకు చెందిన వీరగణేష్ అనే వ్యక్తి ఈనెల 7న కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసుకుని హైదరాబాద్ బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి మంగళవారం వచ్చాడు. ఇంటి తాళాలు తీసి లోపల బీరువా తెరిచి ఉండడంతో చూస్తే బీరువా పెట్టిన 750 గ్రాముల వెండి వస్తువులు కనిపించలేదు. దీంతో గుర్తుతెలియని దొంగలు అపహరించుకుపోయారని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. అదేవిధంగా లింగంపేటకు చెందిన దుర్గాదేవి అనే మహిళ తన ఇంటి కింద పోర్షన్‌కు ఈనెల 10న తాళాలు వేసి పై పోర్షన్‌లోని అత్తవారి వద్దకు వెళ్ళి ఆ రోజు అక్కడే పడుకుంది. మరుసటి రోజు కిందకు దిగి చూస్తే తాళాలు పగులగొట్టి ఉంది. లోపల బీరువాలో పెట్టిన 250 గ్రా ములు వెండి వస్తువులు కనిపించలేదు. ఇళ్లంతా వెతికినా కనిపించకపోవడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదుచేసి ధర్యాప్తు చేస్తున్నారు.

మొబైల్ షాపులో సేల్స్‌ట్యాక్స్ అధికారుల తనిఖీలు

పిఠాపురం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని చర్చి సెంటర్లో గల ఆరుద్ర మొబైల్స్‌లో సేల్స్‌ట్యాక్స్ జీఎస్టీ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. బిల్లులు లేకుండా విక్రయాలు జరుపుతున్నారని, ఇన్‌వాయిస్‌లు, కస్టమర్లకు ఇచ్చే బిల్లుల్లో వత్యాసాలు ఉంటున్నాయని అందిన ఫిర్యాదుల మేరకు వారు షాపులోని రికార్డులు, బిల్లులు, కంప్యూటర్లను తనిఖీ చేశారు. షాపులో తనిఖీలు కొనసాగుతున్నాయని, పూర్తిస్థాయిలో పరిశీలన అనంతరం ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని సేల్స్‌ట్యాక్స్ సూపరింటెండెంట్ కమలాకర్ తెలిపారు. కాగా మొబైల్ షాపులో తనిఖీల చిత్రీకరణకు వెళ్లిన మీడియా ప్రతినిధులపై షాపు నిర్వాహకులు దురుసుగా ప్రవర్తించడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

పొలం పిలుస్తోంది

అంతర్వేది, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయాధికారి పీవీ నరసింహారావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా రైతులకు వ్యవసాయ పద్ధతులపై పలు సూచనలు అందించారు. ఊడ్చిన పొలాలను సందర్శించారు. నత్రజని ఎరువును మూడు దఫాలుగా ఇవ్వాలన్నారు.

మాలేకు సన్మానం

మలికిపురం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మలికిపురం, సఖినేటిపల్లి మండలాల వినియోగదారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మాలే శ్రీనివాసనగేష్‌ను అమలాపురం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం సత్కరించారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జేసీ టి.నిషాంతి అభినందించారు.

పట్టాలున్నాయి.. స్థలాలు చూపించండి



విలసవిల్లి సదస్సులో అర్జీ సమర్పిస్తున్న మహిళ

ఉప్పలగుప్తం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): తమకు పట్టాలిచ్చినా ఇళ్లు కట్టుకునేందుకు స్థలాలు చూపించలేదంటూ విలసవిల్లి రెవెన్యూ సదస్సులో పలువురు లబ్ధిదారులు ఫిర్యాదు చేశారు. సర్పంచ్ సలాది ఊర్మిళాసతీష్ అధ్యక్షతన మంగళవారం విలసవిల్లిలో రెవెన్యూ సదస్సు జరిగింది. గతంలో గ్రామంలోని 4.19ఎకరాల శివాలయం భూమిలో 135మందికి రెండేసి సెంట్ల వంతున ఇళ్ల నిర్మాణానికి కేటాయించారు. సకాలంలో గృహ నిర్మాణాలు జరగనందున స్థలాలు చేతులు మారాయి. అప్పట్లో అధికారులువేరే వారికి స్థలాలను బదలాయించారు. అయితే 40 మంది మాత్రమే గృహాలు నిర్మించుకోగా మిగిలిన స్థలాలు ఇప్పటికీ ఖాళీగానే ఉన్నాయి. ప్రస్తుత సర్పంచ్ సలాది ఊర్మిళాసతీష్ శివాలయం కాలనీలో అర్హులకు స్థలాలు ఇస్తే బాగుంటుందని సూచించినా వైసీపీ పెద్దలు వేరే ప్రాంతంలో ఇళ్ల స్థలాలు కేటాయించారు. కాగా శివాలయం కాలనీలో తమ స్థలాలు చూపించాలంటూ కొందరు పట్టాలను తహసీల్దార్ దివాకర్‌కు చూపించారు. సర్వే చేయించి అర్హులకు న్యాయం జరిగేలా చూస్తామని తహసీల్దార్ చెప్పారు.

146 దరఖాస్తులు

రాజోలు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ములికిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం తహశీల్దార్ ఎన్ఎస్ఎస్ ప్రసాద్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో ప్రత్యేకాధికారి డీఎల్పీవో పి.బొజ్జిరాజు పాల్గొన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి తొమ్మిది దరఖాస్తులు, రేషన్‌కార్డు కోసం 57, గృహ నిర్మాణం 14, పెన్షన్లు 38, ఇంటి స్థలాలు 26, ఇతర శాఖలకు సంబంధించి 2, మొత్తం 146దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సీహెచ్ఎస్ రాజు, అధికారులు, ప్రజాప్రతినిధులు, వీఆర్వోలు, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పదవికి అమిత్‌షా రాజీనామా చేయాలి



కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ జిల్లా శాఖ అధ్యక్షుడు చిట్టిబాబు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్న పార్టీ శ్రేణులు

అమలాపురంటౌన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తక్షణం మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ జిల్లా శాఖ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అమిత్‌షా తక్షణం జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తొలుత కలెక్టరేట్ ఎదుట ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్, నియోజకవర్గ కోఆర్డినేటర్ అయితాబత్తుల సుభాషిణి, ఏఐసీసీ సభ్యుడు చీకట్ల అబ్బాయి, యార్లగడ్డ రవీంద్ర, పట్టణ శాఖ అధ్యక్షుడు వంటెద్దు బాబి, నాయకులు గెడ్డం సురేష్‌బాబు, మాచవరపు శివన్నారాయణ, కోట శ్రీనివాసరావు, పాలెపు ధర్మారావు, సరెళ్ల ప్రసన్నకుమార్, రౌతు ఈశ్వరరావు, షకీలా, అప్పన రామకృష్ణ, దేవరపల్లి రాజేంద్రబాబు, కుడుపూడి శ్రీనివాసరావు, అయితాబత్తుల కుమార్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నెమ్మదిగా రా నాన్న..

అమలాపురం టౌన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): నెమ్మదిగా రా నాన్న.. అంటూ అమలాపురంలో ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటుచేసిన బోర్డులు అందరినీ ఆలోచింప చేస్తున్నాయి. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్, పట్టణ సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఎస్ఐ ఎం.ఏసుబాబు, పట్టణ నలుమూలలా ఈతరహా ఫ్లెక్సీలు, బోర్డులను ఏర్పాటు చేశారు. మద్యం సేవించి వాహనం నడపవద్దని, హెల్మెట్ ధరించడం మర్చిపోవద్దంటూ ఏర్పాటు చేసిన బోర్డులు అందరినీ ఆలోచింప చేస్తున్నాయి.



ఎంప్లాయీస్ యూనియన్ వేడుకలు

అమలాపురం టౌన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): అమలాపురం ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలో మంగళవారం ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ 72వ ఆవిర్భావ వేడుకలను యూనియన్ సంయుక్త కార్యదర్శి వసంత అధ్యక్షతన నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ తిరుమల, డివిజన్ గౌరవాధ్యక్షురాలు శార్వాణి, యూనియన్ జిల్లాశాఖ గౌరవాధ్యక్షుడు కొప్పుల సత్తిబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పతాకావిష్కరణ చేసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు సత్యవతి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి తాళ్లు దగ్ధం

మామిడికుదురు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): బి.దొడ్డవరంలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన అగ్నిప్రమాదంలో కొబ్బరి డొక్కతాళ్లు కాలి బూడిదయ్యాయి. ఎగుమతికి సిద్ధంగా ఉన్న రూ.2.50లక్షల విలువైన ఆరు టన్నుల డొక్క తాళ్లు పూర్తిగా కాలిపోయాయి. ఈ డొక్కతాడును హైదరాబాద్‌కు ఎగుమతి చేసేందుకు గోడౌన్ బయట సిద్ధం చేశారు. మంటలు ఆర్పేందుకు స్థానికులు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని బాధితులు చింతపల్లి శ్రీనివాస్, బొలిశెట్టి ప్రసాద్ వాపోయారు.

ప్రారంభమైన క్రిస్మస్ వేడుకలు









అమలాపురం మన్నా జూబ్లీ చర్చిలో ప్రార్థనలు, మన్నా చర్చిలో ప్రారంభమైన క్రిస్మస్ వేడుకలు, యానాం రోమన్ కేథలిక్ చర్చి ఆవరణలో ఏసుక్రీస్తు, శిష్యులు, యానాం లూర్దుమాత ప్రార్థనా మందిరం

- విద్యుత్ దీపాల వెలుగుల్లో చర్చిలు
- ప్రారంభమైన క్రిస్మస్ ప్రార్థనలు





యానాం రోమన్ కేథలిక్ చర్చిలో ఏసుక్రీస్తు, ముమ్మిడివరం ఆర్‌సీఎం చర్చి

అమలాపురం టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అమలాపురం నల్లవంతెన దిగువనున్న మన్నా జూబ్లీ చర్చిలో మంగళవారం రాత్రి నుంచి క్రిస్మస్ వేడుకలు ప్రారంభమయ్యాయి. రెవ.కార్ల్ డేవిడ్ కొమానపల్లి, షారోన్‌రోజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో విద్యార్థులు క్రీస్తు జననంపై రూపొందించిన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. క్రీస్తు రాకడను కోరుతూ ఆలపించిన ప్రత్యేక గీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి. రెవ. ఎర్నెస్ట్ తాతపూడి, ఎస్తేరు జ్యోతి తాతపూడిలతో పాటు పలువురు పాస్టర్లు క్రీస్తు జననాన్ని వివరిస్తూ ప్రసంగించారు. వివిధ ప్రాంతాలకు చెందిన క్రైస్తవ విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అమలాపురం సహస్ర ఇంటర్నేషనల్ స్కూల్‌లో డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు, ప్రిన్సిపాల్ గౌసియాబేగం ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు శాంతాక్లాజ్, మేరీమాత, దేవదూతల వేషధారణల్లో ఆకట్టుకున్నారు.

విద్యుత్ కాంతులతో చర్చిలు

అంబాజీపేట, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ సందర్భంగా మండలంలోని క్రైస్తవ మందిరాలు విద్యుత్ కాంతులతో మిలమిలలాడుతున్నాయి. చర్చిలను విద్యుత్ దీపాలు, ప్రత్యేకంగా అలంకరించిన సెట్టింగ్స్‌తో సర్వాంగ సుందరంగా అలంకరించారు. క్రిస్మస్ పండుగకు పట్టణాలు, పల్లెలు ముస్తాబయ్యాయి. క్రిస్మస్ వేడుకలు ఘనంగా ప్రారంభయయ్యాయి. ప్రసిద్ధి చెందిన చర్చిల్లో మినీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. అంబాజీపేట సెయింట్ మేరీస్ పాఠశాలలో ఏర్పాటుచేసిన ఏసుక్రీస్తు ఇతివృత్తం అందర్ని ఆకట్టుకుంది. ఇరుసుమండ, అంబాజీపేట, గంగలకుర్రు, మొసలపల్లి, నందంపూడి, వాకలగరువు, చిరతపూడి, ఇసుకపూడి తదితర గ్రామాల్లో చర్చిలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

క్రిస్మస్ సందేశం

అంతర్వేది, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ వేడుకలతో సఖినేటిపల్లి మండలంలో సందడి నెలకొంది. ప్రార్థనా మందిరాలు, చర్చిలను విద్యుద్దీపాలతో ముస్తాబు చేశారు. మందిరాల వద్ద ప్రముఖ పాస్టర్లు క్రిస్మస్ సందేశాన్ని అందించారు. సఖినేటిపల్లి గ్రామంలో జరిగిన యూత్ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని సందేశాన్ని అందించారు. అంతర్వేది సైకిల్ షాపు సెంటర్, చొప్పలవారి గ్రూపులో పాస్టర్ కొల్లాబత్తుల అహరోన్‌రాజు, దొండపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో పాస్టర్ పి.జోబ్డ్స్ క్రిస్మస్ ఆరాధన సందేశాన్ని అందించారు. సంఘ పెద్దలు, విశ్వాసులు, యువత అధిక సంఖ్యలో పాల్గొని కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

అల్లవరం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): క్రీస్తు బోధనలు ఆచరణీయమని అంతర్జాతీయ క్రైస్తవ ప్రసంగికులు కిరణ్‌పాల్ అన్నారు. గోడిలంక, గోడితిప్ప, కొమరగిరిపట్నం, తుమ్మలపల్లి, డి.రావులపాలెం, గుడాల, దేవగుప్తం పరిసర ప్రాంతాల్లో చర్చిల వద్ద క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గోడితిప్ప చర్చి వద్ద పాస్టర్ వై.నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, మాజీ ఏఎంసీ చైర్మన్ గునిశెట్టి చినబాబు పాల్గొన్నారు. సర్పంచ్‌లు వడ్డి సుభాషిణి, చిట్నీడి శ్రీదేవి, తోట శ్రీదేవి, అడ్డాల దావీద్, కె.ప్రకాష్, భర్ణబాస్, ఎంజే రాజు, డి.మోజేష్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు జరిగాయి.

ముస్తాబైన రోమన్ కేథలిక్ చర్చి

యానాం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): యానాంలోని రోమన్ కేథలిక్ చర్చి క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైంది. ఈచర్చిలో సర్వమత సౌభ్రాతృత్వానికి ప్రతీకగా క్రైస్తవులే కాకుండా యానాం పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు కులమతాలకు అతీతంగా వచ్చి ప్రార్థనలు చేసి కొవ్వొత్తులను వెలిగించడం ఆనవాయితీగా వస్తుంది. ఆర్‌సీ చర్చి ఫాదర్ మారియాదాస్ నేతృత్వంలో మంగళవారం అర్ధరాత్రి నుంచి ఉదయం వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే యానాం వృద్ధాశ్రమ ఆధీనంలోని యానాం బేబీ కేర్ సెంటర్‌లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వృద్ధాశ్రమ కోఆర్డినేటర్ పెసల గంగయ్య కేక్ కట్‌చేసి విద్యార్థులకు పంచారు. అనంతరం శాంతాక్లాజ్ పిల్లలందరిని అలంరించారు. ఈసందర్భంగా చాక్లెట్స్ ఇచ్చారు.

క్రిస్మస్ వేడుకలకు సిద్ధం

ముమ్మిడివరం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తు జన్మించిన రోజును క్రైస్తవులు క్రిస్మస్‌గా జరుపుకుంటారు. క్రీస్తు పుట్టినరోజుకు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. క్రిస్మస్ మాసాన్ని హాలిడే సీజన్, సీజన్‌ఆఫ్ జాయ్‌గా పిల్లాపాపలతో వేడుకలు జరుపుకుంటారు. అందుకే దీనిని స్పిరిట్ ఆఫ్ క్రిస్మస్‌గా పిలుస్తారు. ఇళ్లల్లో, చర్చిల్లో క్రీస్తు పుట్టిన పశువుల పాకను బొమ్మలతో అలంకరించారు. ముమ్మిడివరం ఆరీసీఎం చర్చి, మున్నా మందిరం, సెయింట్ లూథరన్ చర్చితో పాటు పలు చర్చిలను విద్యుత్ పాటు పలు చర్చిల్లో క్రిస్మస్ సందర్భంగా చర్చిలను అలంకరించారు. అలాగే పలు చర్చిల్లో ఏర్పాటు చేసిన కేక్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇళ్ల వద్ద చర్చిల వద్ద స్టార్లను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

శాంతాక్లాజ్‌ల వేషధారణల్లో

మామిడికుదురు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మామిడికుదురు దీప్తి స్కూలులో క్రిస్మస్ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు శాంతాక్లాజ్, శాంతి దూతల వేషధారణల్లో అలరించారు. ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియచేసుకున్నారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్‌చేసి పంచుకున్నారు. పలువురు విద్యార్థులు క్రిస్మస్ గీతాలను ఆలపించారు. క్రిస్మస్ ప్రాముఖ్యతను కరస్పాండెంట్ డీవీవీ సత్యనారాయణ విద్యార్థులకు వివరించారు.

రాష్ట్ర స్థాయి చదరంగం పోటీల్లో సాహితీ ప్రతిభ



సాహితీని అభినందిస్తున్న ఎమ్మెల్యే దాట్ల







రాజోలుబాలికలను అభినందిస్తున్న పీఈటీ రత్నకుమారి, మామిడికుదురు: కుంగ్‌ఫూలో పతకాలు సాధించిన విద్యార్థులతో కోచ్, అమలాపురం:పవర్ లిఫ్టింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించిన కిరణ్‌కుమార్‌ను అభినందిస్తున్న దృశ్యం

ముమ్మిడివరం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఠాణేలంక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న వేదరాజు భావనశ్రీదేవినాగసాహితీ చదరంగం పోటీల్లో ప్రతిభ చాటి పతకాలు సాధించడంతో ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అభినందించి మంగళవారం షీల్డు అందజేశారు.

కిరణ్‌కుమార్‌కు స్వర్ణ పతకం

అమలాపురం టౌన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): బొమ్మూరులో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ బెంచ్ ప్రెస్ చాంపియన్ షిప్ పోటీల్లో అమలాపురం జీకే ఫిట్‌నెస్ జిమ్ క్రీడాకారుడు చీకురుమెల్లి కిరణ్‌కుమార్ 74కిలోల మాస్టర్ కేటగిరిలో ప్రథమస్థానం సాధించి స్వర్ణ పతకాలు దక్కించుకున్నారు. బెంచ్‌ప్రెస్‌తో పాటు పవర్ లిఫ్టింగ్‌లోను ప్రథమస్థానం సాధించిన కిరణ్‌కుమార్‌ను డి.గోపీకృష్ణ, డాక్టర్ శివఆశీష్, డాక్టర్ కడలి ప్రసాద్, ఎస్.మణికంఠ, డి.మణికంఠ తదితరులు అభినందించారు.

కుంగ్‌ఫూలో ఆరుగురికి పతకాలు

మామిడికుదురు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్మాయిటైగర్ కుంగ్‌ఫూ పోటీల్లో ఆరుగురు విద్యార్థులు పతకాలు సాధించినట్టు కోచ్ మట్టా శ్రీనివాస్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో జరిగిన పోటీల్లో నగరానికి చెందిన యావర్ అబ్బాస్, బి.సావరానికి చెందిన మూడోతరగతి విద్యార్థి బి.పారైన్ బంగారు, మామిడికుదురుకు చెందిన ఒకటో తరగతి విద్యార్థిని ఓదూరిమనోజ్ఞశ్రీవర్షిత, 5వ తరగతి విద్యార్థిని కంకిపాటి తనిష్క, ఫస్ట్‌క్లాస్ విద్యార్థిని భూపతి యాష్మికబాల, 9వ తరగతి విద్యార్థి ఇంజేటి సూర్యభరత్ రజత పతకాలు సాధించారు.

రాజోలు గురుకుల బాలికల ప్రతిభ

రాజోలు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా కృష్ణలంకలో రాష్ట్ర స్థాయిలో జరిగిన ఎస్‌జీఎఫ్ 68వ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజోలు గురుకుల పాఠశాలకు చెందిన ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ, పాఠశాల విద్యార్థినులు ఆరుగురు బాలికలు ఈనెల22వ తేదీన జరిగిన పోటీల్లో పాల్గొన్నారని ప్రిన్సిపాల్ టి.లలితకుమారి తెలిపారు. ఈసందర్భంగా ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో ముగ్గురు బాలికలు పతకాలు గెలుచుకున్నారు. అండర్-19లో బి.రమ్యశ్రీ, ఎస్.రమ్యలు ద్వితీయస్థానంలో నిలవగా కె.మంజుల తృతీయ స్థానంలో నిలిచి పతకాలు సాధించినట్టు తెలిపారు. విజేతలు రమ్యశ్రీ, రమ్య, మంజులను ప్రిన్సిపాల్ లలితకుమారి, వైస్ ప్రిన్సిపాల్ వి.అనితకుమారి, అధ్యాపకులు అభినందించారు.

కోకోఫెడ్ చైర్మన్ అరిగెలకు రాష్ట్ర స్థాయి అవార్డు

అంబాజీపేట, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా కోనసీమ వినియోగదారులసంఘం చైర్మన్ అరి గెల బలరామ్మూర్తికి రాష్ట్ర స్థాయి అవార్డు లభించింది. ఈసందర్భంగా విజయవాడ తుమ్మలపల్లి శ్రీకళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో పౌర సరఫ రాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ నుంచి అవార్డును అందుకున్నారు. వినియోగదారులకు విశేష సేవలు అందించినందుకు అవార్డు లభించిందని బలరామ్మూర్తి తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి ఆదిత్యకిరణ్ ఉన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

మలికిపురం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధితో ఎందరికో మేలు జరుగుతుందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మంగళవారం విశ్వేశ్వరాయపురంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద నలుగురికి రూ.6లక్షల చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా నియోజకవర్గంలో ఇప్పటికే ఎందరికో మేలు చేసినట్లు చెప్పారు. కూటమి పాలనలో అభివృద్ధితో పాటు సంక్షేమానికి కూడా తగు ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో విశ్వేశ్వరాయపురం సర్పంచ్ చెల్లుబోయిన హెలీన, గుండుబోగుల పెద్దకాపు, డీసీ పినిశెట్టి బుజ్జి, ఆచంట శ్రీనివాస్, రాపాక ఆనంద్‌కుమార్, పిండి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు సతీవియోగం

అల్లవరం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): తెలుగు రైతు రాష్ట్ర మాజీ నేత, కోడూరుపాడు సర్పంచ్ నడింపల్లి సుబ్బారాజు భార్య సత్యవతిదేవి(72) మంగళవారం అనారోగ్యంతో మృతిచెందారు. సత్యవతీదేవి భౌతికకాయాన్ని కోడూరుపాడులో ఎంపీ హరీష్‌కుమార్ సందర్శించి నివాళులర్పించారు. సత్యవతీదేవి మృతి పట్ల ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, టీడీపీ మండల అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు, దాట్ల సత్యనారాయణ రాజు, గునిశెట్టి చినబాబు, సాధనాల వెంకట్రావు, పిల్లా ప్రసాద్, దాకారపు చిరంజీవి, నార్గన శ్రీనివాస్ సంతాపం వ్యక్తం చేశారు.

ఆర్థికశాస్త్రంలో మురళీకృష్ణకు డాక్టరేట్



మామిడికుదురు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): గోగన్నమఠం గ్రామానికి చెందిన పెనుమాల మురళీకృష్ణ ఆర్థికశాస్త్రంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందారు. ఆంధ్రప్రదేశ్‌లోని రైతుబజార్ల ప్రాముఖ్యత, వాటి ప్రభావం అనే అంశంపై ఆయన చేసిన పరిశోధనలకు డాక్టరేట్ లభించింది. మురళీకృష్ణ గతంలో రాజోలు డిగ్రీ ప్రభుత్వ కళాశాలలో అధ్యాపకునిగా, తరువాత ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఎంపికై తెలంగాణలో పనిచేస్తున్నారు. గ్రామస్తులు భూపతిరాజు సత్తిబాబురాజు, భూపతిరాజు ఈశ్వరరాజు, అల్లు విజయలక్ష్మి, లంకే శ్రీనివాస్, చిగురుపాటి పెద్దిరాజు తదితరులు అభినందనలు తెలిపారు.

దుకాణాలు దగ్ధం

పి.గన్నవరం, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం షిర్డిసాయి ఆలయం సమీపంలో సోమవారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో ప్రధాన పంటకాల్వ చెంతనే ఉన్న దుకాణాలు దగ్ధమయ్యాయి. ఎండుచేపల దుకాణం, బజ్జీలబండి, మొక్కజొన్న పొత్తులబండి పూర్తిగా దగ్ధమయ్యాయి. అమలాపురం ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఎండు చేపల వ్యాపారికి అధికనష్టం వాటిల్లినట్లు స్థానికులు తెలిపారు.

ఇసుకకు సచివాలయాల అనుమతి తప్పనిసరి

పి.గన్నవరం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): అనధికార ఇసుక ర్యాంపుల్లో అధికారులు ఆంక్షలు విధించారు. సోమవారం ప్రముఖ దినపత్రికల్లో ప్రచురితమైన వార్తా కథనాలపై స్పందించిన అధికారులు స్థానిక సచివాలయంలో అనుమతులు తీసుకోవాలని ఆంక్షలు విధించారు. అక్రమంలోనైనా ఉచిత ఇసుకను సక్రమంగా లబ్ధిదారులకు అందించాలనే లక్ష్యంతో అధికారులు పి.గన్నవరం డీఎస్‌పాలెం ర్యాంపుపై దృష్టిచారించారు. లబ్ధిదారులకు అవసరాలు మేరకు ఎంతమేర ఇసుక అవసరమో స్థానిక సచివాలయాల్లో సంబంధిత కార్యదర్శి నుంచి అనుమతులు పొందాలని తహశీల్దార్ పి.శ్రీపల్లవి సూచించారు. అనుమతులతో కూడిన పత్రం ఉంటేనే ట్రాక్టర్లను ర్యాంపులోకి అనుమతించాలని ర్యాంపు నిర్వాహకులు, స్థానిక రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. నిబంధనలు విధించడంతో ర్యాంపు మధ్యాహ్నం నుంచి నిలిచిపోయింది. కాగా మండలంలోని పలు ప్రాంతాల్లో ఇంకా ఇసుక దందా కొనసాగుతూనే ఉంది.

సత్యప్రసాద్‌కు ఉత్తమ పరిశోధనా పత్రం అవార్డు

మామిడికుదురు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మామిడికుదురు దీప్తి డిగ్రీ కళాశాలకు చెందిన ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి యర్రంశెట్టి విజయసత్యప్రసాద్‌కు ఉత్తమ పరిశోధనా పత్రం అవార్డు లభించింది. కరేబియన్ సైన్స్ టెక్నాలజీస్ ఇన్‌సైడ్ జర్నల్‌లో సత్యప్రసాద్ సమర్పించిన బ్యూటీఫుల్ రిలేషన్ షిప్ బిట్విన్ నానో టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్‌కు సంబంధించి సమర్పించిన పరిశోధనా పత్రానికి గాను ఈఅవార్డుకు ఎంపికయ్యారు. ఈనెల22,23 తేదీల్లో తిరుచునూరులోని శ్రీపద్మావతి స్కూల్ ఆఫ్ ఫార్మసీలో జరిగిన అంతర్జాతీయ సమావేశంలో అవార్డును అందుకున్నారు. సత్యప్రసాద్‌ను దీప్తి కరస్పాండెంట్ డీవీవీ సత్యనారాయణ, సాయిదీప్తి కళాశాల ప్రిన్సిపాల్ జక్కంపూడి శివప్రసాద్, మోకా రంగారావు, అధ్యాపకులు అభినందించారు.

ఎంపీ సానా సతీష్‌ను కలిసిన ఎంపీపీ కేతా శ్రీను



రాజోలు, డిసెంబరు 24(ఆంధ్ర జ్యోతి): కాకినాడకు చెందిన రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌ను కాకినాడలో మంగళవారం రాజోలు ఎంపీపీ కేతా శ్రీను, వెంకటలక్ష్మి దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే క్రిస్మస్ శుభాకాంక్షలు

పి.గన్నవరం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజలకు, క్రైస్తవులకు క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ అనేది కేవలం పండుగ మాత్రమే కాదని మనిషిని నిరంతరం సన్మార్గంలో నడిపించే దైవికమైన ఒక భావన అని అన్నారు. క్రిస్మస్ పండుగను నియోజకవర్గంలోని క్రైస్తవులందరూ సుఖ సంతోషాలతో జరుపుకుని ఆనందంగా గడపాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

మత్స్యకారులు వేటకు వెళ్లరాదు

అంతర్వేది, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో మత్స్యకారులెవరూ వేటకు వెళ్లరాదని మత్స్యశాఖ అధికారులు సూచించారు. అంతర్వేది పల్లిపాలెం మినీఫిషింగ్ హార్బరులో బోట్లను మత్స్యకారులు నిలిపివేశారు. వర్షాలు వచ్చే పరిస్థితి ఉన్నందున మత్స్యకార గ్రామాలు, తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

శ్రీఅభయ ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

పి.గన్నవరం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): బెల్లంపూడిలో వేంచేసి ఉన్న శ్రీఅభయ ఆంజనేయస్వామి ఆలయ 18వ వార్షికోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. బండి నాగేశ్వరరావు, నాగరత్నం దంపతులు తమల పాకులు, తులసిమాలలు, ప్రత్యేక పూలతో స్వామివార్ని అలంకరించారు. అనంతరం బండి వీరరాఘవులు, నారాయణమూర్తి కుమారులు ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు.

ఘనంగా భవానీల ఇరుముడులు

అంబాజీపేట, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట పశువుల సంతమార్కెట్‌లో ఉన్న శ్రీవిజయకనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో గురుభవానీ మట్టపర్తి శ్రీనివాస్ ఆధ్వర్యంలో దీక్ష చేపట్టిన భవానీలు ఇరుముడి కట్టుకుని విజయవాడ బయలుదేరి వెళ్లారు. ఈసందర్భంగా అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఇరుముడి కట్టుకుని విజయవాడ చండీ హోమానికి తరలివెళ్లారు.

సీగల్స్‌లో న్యూఇయర్ వేడుకలకు ఏర్పాట్లు

యానాం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి పర్యాటక శాఖకు సంబంధించి టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో భాగమైన యానాం సీగల్స్‌లో ఛీల్ 2025పేరిట న్యూయర్ వేడుకలు నిర్వహిస్తామని యానాం పరిపాలనాధికారి, సీగల్స్ జనరల్ మేనేజర్ మునిస్వామి అన్నారు. మంగళవారం స్థానిక సీగల్స్ రెస్టారెంట్‌లో మేనేజర్ మురళీధరన్ నేతృత్వంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పుదుచ్చేరి పర్యాటక శాఖ నిధులతో వైభవంగా న్యూయర్ వేడుకలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం సీగల్స్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. డిసెంబరు 31వతేదీ సాయంత్రం నుంచి న్యూయర్ వేడుకలు ప్రారంభిస్తామన్నారు. ఫైర్‌క్రాకర్స్‌షోతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమలు నిర్వహిస్తామన్నారు. వీటిలో ప్రవేశానికి ఒక్కొక్కరికి రూ.500 చొప్పున, దంపతులకు రూ.800చొప్పున వసూలు చేస్తామన్నారు.

27న జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

అమలాపురం టౌన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): జాతీయ వాలీబాల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు రాష్ట్ర జట్టు తరపున క్రీడాకారులను ఈనెల27న విజయవాడలో ఎంపిక చేయనున్నట్టు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు పీఎస్ సురేష్‌కుమార్ తెలిపారు. రాజస్థాన్‌లోని జైపూర్‌లో జనవరి 7నుంచి 13వరకు జాతీయ సీనియర్ నేషనల్ వాలీబాల్ చాంపియన్ షిప్-2025 పోటీలు జరుగుతాయన్నారు. ఈపోటీల్లో పాల్గొనేందుకు క్రీడాకారులను విజయవాడలోని ఐజీఎంసీ స్టేడియంలో ఈనెల27న ఎంపిక చేస్తారని, జిల్లాలోని అర్హత గత సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు ఉదయం 7గంటలకే హాజరు కావాలని, వివరాలకు సెల్ 7993329433ని సంప్రదించాలని సురేష్‌కుమార్ కోరారు.

గుడ్ గవర్నెన్స్ డే

అమలాపురం టౌన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో అమలాపురం ఏఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం గుడ్ గవర్నెన్స్ డే నిర్వహించారు. స్వామి వివేకానంద సేవా సమితి ప్రతినిధి గనిశెట్టి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని పురస్కరించుకుని డిసెంబరు 25న సుపరిపాలనా దినంగా కేంద్రం ప్రకటించిందన్నారు. వాజ్‌పేయి హయాంలో సాధించిన విజయాలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీహెచ్ కిశోర్‌కుమార్, పీజీ ప్రిన్సిపాల్ ఎం.అన్నాజీరావు, నెహ్రూ యువ కేంద్ర వలంటీర్లు కాశిన పణీంద్ర, ఈశ్వర్, సరోజినీ పాల్గొన్నారు.

బాధితులకు వసుధ ఫౌండేషన్ ఆర్థిక సాయం

అల్లవరం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): గోడిలంకలో కండరాల వ్యాధితో బాధపడుతున్న రుద్రరాజు సూర్యకాంతం, రెల్లుగడ్డలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న నడింపల్లి సత్యనారాయణరాజుకు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ దాత మంతెన వెంకటరామరాజు రూ.20వేలు వంతున రూ.40వేలు ఆర్థిక సాయం మంగళవారం అందజేశారు. అమలాపురం, పాలకొల్లు ఫౌండేషన్ కన్వీనర్లు రుద్రరాజు సత్యనారాయణ, పెన్మత్స బుద్ధరాజు గోడిలంక బాధితులకు సాయాన్ని అందజేశారు. దాతల ఔదార్యాన్ని సర్పంచ్ రుద్రరాజు పవిత్రలక్ష్మి పతిరాజు, వేగిరాజు సుబ్బరాజు అభినందించారు.

మండపేట

కొత్తపేట • మండపేట • రామచంద్రపురం



వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు చేస్తున్న దృశ్యం

వాడపల్లి ఆలయంలో భక్తుల సందడి

ఆత్రేయపురం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం మంగళవారం కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు, అర్చనలు జరిపారు. వేకువజామునే స్వామివారికి గోదావరి జలాలను బిందెతో తీసుకువచ్చి స్నపనమూర్తులకు అభిషేకం చేశారు. అనంతరం తిరుప్పావై వేదపారాయణం చేశారు. నోము ఆచరించిన పలువురు భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.2,84,076 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి హైదరాబాద్‌కు చెందిన సరిపల్లె వెంకటపతిరాజు, సత్యవతి దంపతులు రూ.50వేలు విరాళం ఇచ్చారు. దాతలకు ఆయన సిబ్బంది స్వామివారి చిత్రపటం అందించారు.

రిజిస్ట్రార్ కార్యాలయాల పరిశీలన

రామచంద్రపురం (ద్రాక్షారామ), డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆస్తుల విలువ సవరణ మేరకు రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జరుగుతున్న కార్యాచరణను పరిశీలిస్తున్నట్టు రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ డీఐజీ బి.శివరాం తెలిపారు. మంగళవారం ద్రాక్షారామ, రామచంద్రపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆయన పరిశీలించారు. డేటా ఎంట్రీ విధానాన్ని ఆయన తనిఖీ చేశారు. ద్రాక్షారామ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ ఆర్ఎస్ రాణి, రామచంద్రపురం రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ టీపీ ఎస్ వి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



రామచంద్రపురంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఐజీ

రైతులు పంట నమోదు, ఈకేవైసీ చేయించుకోవాలి

కపిలేశ్వరపురం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రబీ పంటకు సంబంధించి రైతులు పంట నమోదుతో పాటు ఈకేవైసీ చేయించుకోవాలని ఆలమూరు సహాయ వ్యవసాయ సంచాలకులు కె.నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని నేలటూరులో జరిపిన పొలం పిలుస్తోందిలో ఆయన మాట్లాడారు. ఏవో రమేష్‌కుమార్ మాట్లాడుతూ ఈనెల 26 నుంచి ప్రతి గ్రామంలో రైతుసేవా కేంద్రంలో వ్యవసాయ సహాయకుల ద్వారా రైతులు నమోదు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు వి.స్వామి, ఉపసర్పంచ్ శనక్కాయల సుబ్రహ్మణ్యం, నీటి సంఘం మెంబర్ మల్లిపూడి వెంకట్రావు, గ్రామ నాయకులు పెనుమర్తి వెంకట్రావు, పుట్టా దొరబాబు, బొబ్బా శ్రీనివాస్ తదితరులతోపాటు రైతులు పాల్గొన్నారు.



పొలం పిలుస్తోందిలో మాట్లాడుతున్న ఏడీఏ నాగేశ్వరరావు

వ్యాసరచన పోటీల్లో విద్యార్థికి ప్రథమస్థానం

కె.గంగవరం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థులకు జరిపిన వ్యాస రచన పోటీల్లో దంగేరు ఉన్నత పాఠశాల విద్యార్థి జిల్లాస్థాయిలో ప్రథమస్థానం పొందింది. జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల పాఠశాలలో వ్యాస రచన పోటీలు జరిపారు. ఈ పోటీల్లో దంగేరు విద్యార్థిని డి.విద్య ప్రథమస్థానాన్ని కైవసం చేసుకోగా, ఆంగ్లంలో జరిపిన పోటీల్లో ద్వితీయస్థానాన్ని సంపాదించింది. అమలాపురంలో మంగళవారం జరిపిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నిషాంతి నుంచి శ్రీవిద్య తరపున ఆమె తల్లి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.రాజు అవార్డు అందుకున్నారు. అవార్డు పొందిన శ్రీవిద్యను ఎంఈవో ఏ.నాగరాజు, ఎంఈవో-2 చోడిశెట్టి ఆంజనేయులు, దంగేరు సర్పంచ్ కొప్పిశెట్టి వెంకట రమణ, ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్, ఎస్ఎంసీ ఛైర్మన్, ఉపాధ్యాయుల బృందం, గ్రామస్తులు తదితరులు అభినందించారు.



విద్యార్థిని తరపున అవార్డు తీసుకుంటున్న శ్రీవిద్య తల్లి, ప్రధానోపాధ్యాయుడు

పేరవరం పంపింగ్ స్కీమ్‌కు మరమ్మతులు

ఆత్రేయపురం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పేరవరం పంపింగ్ స్కీమ్ ద్వారా శివారు ప్రాంత రైతులకు సాగునీరు అందించే చర్యలు చేపట్టారు. కొంతకాలం నుంచి పంపింగ్ స్కీమ్‌లో మోటార్లు పాడైపోవడంతో ఒకపంపు ద్వారానే సాగునీరు వెళ్లడంతో రైతులకు అందక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పంపింగ్ స్కీమ్‌లోని ఐదు మోటార్ల ద్వారా సాగునీరు అందించాల్సి ఉంది. ప్రస్తుతం పంపింగ్ స్కీమ్‌లో మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశాల మేరకు నీటి సంఘ అధ్యక్షుడు జుజ్జవరపు హరిబాబు మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టారు. మంగళవారం పనులు పూర్తి చేయడంతో నాలుగు పంపుల ద్వారా సాగునీరు శివారు ప్రాంతాలకు వెళ్లేలా చర్యలు చేపట్టడంతో రైతుల సమస్యలను పరిష్కారమయ్యాయి.



పేరవరం పంపింగ్ స్కీమ్‌లో మోటార్లను మరమ్మతులు చేస్తున్న దృశ్యం

గడువులోగా రహదారుల నిర్మాణం పూర్తి చేయండి

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం నియోజకవర్గంలో ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్ రహదారుల నిర్మాణం గడువులోగా పూర్తి చేయాలని మంత్రి సుభాష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఆయన ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్ అధికారులతో రోడ్ల నిర్మాణ పురోగతిపై సమావేశం జరిపారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు వచ్చే సంక్రాంతి నాటికి శిథిలావస్థలో ఉన్న రోడ్లు, నూతన రహదారుల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. రామచంద్రపురం పట్టణం, మండలం, కె.గంగవరం మండలాల్లో రోడ్ల నిర్మాణం ప్రగతిని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీఈఈ సూర్యనారాయణ, కామేశ్వరరావు, ఏఈలు శంకర్, వెంకటేశ్వరరావు, ప్రసన్న, రమణ, పీఆర్ డీఈఈ సత్యశ్రీనివాస్, భూషణ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

బాల్యదశ నుంచే క్రీడలు భాగం కావాలి:

బాల్యం నుంచే క్రీడలు జీవితంలో భాగం కావాలని మంత్రి సుభాష్ అన్నారు. మంగళవారం రామచంద్రపురంలో కృత్తివెంటి పేర్రాజు పంతులు ఇండోర్ స్టేడియంలో చింతా సుబ్బారాయుడు మెమోరియల్ షటిల్ బాడ్మింటన్ ఇన్విటేషన్ చాంపియన్‌షిప్ పోటీలను మంత్రి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత క్రీడలకు ప్రాధాన్యం ఇస్తుందని వారికి రిజర్వేషన్ కోటాను పెంపుదల చేశామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ చెలికాని స్టాలిన్, స్వర్గీయ చింతా సుబ్బారాయుడు కుటుంబీకులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కులు అందజేత

మండపేట, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): అనారోగ్యాలతో బాధపడుతున్న 13 మందికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.21,07,522 చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు టీడీపీ కార్యాలయంలో బాధితులకు అందించారు. నియోజకవర్గ పరిధిలో గల పలు ప్రాంతాలకు చెందిన పదమూడు మందికి సీఎం సహాయ నిధి మంజూరు చేయించిన ఆయనకు వారు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం సహాయ నిధి పంపిణీలో స్థానిక నాయకులు, పలువురు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సీఎం సహాయనిధి అందిస్తున్న దృశ్యం

మంచినీటి మోటార్ చోరీపై ఫిర్యాదు

కొత్తపేట, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఏనుగులమహల్ ప్రధాన రహదారి పక్కన షాపింగ్ కాంప్లెక్స్ వద్ద గుర్తు తెలియని దుండగులు వాటర్ మోటార్‌ను దొంగిలించారు. మంగళవారం చోరీ ప్రదేశాన్ని ఏఎస్ఐ జీవీ కృష్ణారావు పరిశీలించారు. బాధితుడు విశ్వ వీరమారుతి ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ తెలిపారు.

సోలార్‌తో కాలుష్య రహిత విద్యుత్

• నూరు శాతం సోలార్ పూర్తి చేసిన గ్రామానికి రూ.కోటి నగదు నజరానా • మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, డిసెంబరు, 24(ఆంధ్రజ్యోతి): సోలార్ విద్యుత్‌ను నూరుశాతం వినియోగించుకుని లబ్ధిపొందాలని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కోరారు. మంగళవారం సత్య భాస్కర జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకానికి సంబంధించి అర్తమూరు గ్రామం ఎంపికైన సందర్భంగా జరిగిన కార్యక్రమానికి మాజీ సర్పంచ్ ఎన్.వీర్రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సదస్సుకు ఎమ్మెల్యేతోపాటు, విద్యుత్‌శాఖ జిల్లా ఎస్ఇ రాజబాబు, సోలార్ సంస్థ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ ఎస్ఇ రాజబాబు మాట్లాడుతూ వినియోగదారుడే విద్యుత్‌ను ఉత్పత్తి చేసి దాన్నించి ఆదాయం పొందేలా కేంద్ర ప్రభుత్వం సోలార్ పలకలను ఏర్పాటు చేసే ప్రక్రియ ప్రారంభించిందన్నారు. జిల్లాలో ఎంపిక చేసిన ఐదు గ్రామాల్లో సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. నూరుశాతం సోలార్‌ను ఏర్పాటు చేసుకున్న గ్రామాలకు కేంద్ర ప్రభుత్వం రూ.1కోటి వరకు నగదు అందిస్తుందన్నారు. సోలార్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు ఆవిష్కరించారు. సోలార్ వల్ల కలిగే ప్రయోజనాలు, ప్రభుత్వ రాయితీతోపాటు, బ్యాంకు రుణాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సభలో ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ కపిలేశ్వరపురం మండలంలోని టేకి, మండపేట పట్టణంలో రెండు విద్యుత్ సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అర్తమూరు గ్రామంలో త్వరలో డ్వాక్రా భవన్ నిర్మిస్తామన్నారు. అర్తమూరులో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో స్థానిక నేతలతో కలిసి ఆయన పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల, విద్యుత్‌శాఖ ఎస్ఇ రాజబాబు, టీడీపీ శ్రేణులు

ఎమ్మెల్యేకు సన్మానం: అర్తమూరు గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే వేగుళ్లను టీడీపీ నేతలు, ఉద్యోగులు సత్కరించారు. విద్యుత్ శాఖ ఎస్ఇ రాజబాబును సహచర ఉద్యోగులు, స్థానిక నేతలు సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోలుగూరి అన్నపూర్ణ, ఉపసర్పంచ్ కె.సత్యనారాయణ రెడ్డి, పి.సుబ్బారెడ్డి, మండపేట మండల తహశీల్దార్ తేజేశ్వరరావు, ఈవోపీఆర్డీ దాసరి శ్రీనివాసరావు, విద్యుత్‌శాఖ అధికారులతో పాటు స్థానిక నేతలు పడాల సుబ్బారెడ్డి, తాడి శేషారెడ్డి, పంచాయతీ కార్యదర్శి అనిల్, తదితరులు పాల్గొన్నారు.



కట్టుంగలో ఇసుక అక్రమ నిల్వను సీజ్ చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఇసుక అక్రమ నిల్వల సీజ్

ఆత్రేయపురం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం కట్టుంగ గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. కట్టుంగ రీచ్‌లో అక్రమార్కులు అనధికారికంగా తవ్వకాలు జరిపిన నేపథ్యంలో ఈ వ్యవహారంపై ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాలపై అధికార యంత్రాంగం స్పందించింది. ఈ నేపథ్యంలో ఆర్డీవో శ్రీకర్ ఆదేశాల మేరకు ర్యాంపు వద్ద ట్రాక్టర్లు వెళ్లకుండా గడ్డర్లు ఏర్పాటు చేశారు. గ్రామంలో అక్రమ నిల్వలను గుర్తించి సీజ్ చేయడంతో పాటు వాటిని పంచాయతీకి అప్పగించినట్టు తహశీల్దారు రాజేశ్వరరావు తెలిపారు.



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న కార్పెంటర్లు

ఆర్డీవో అఖిలకు కార్పెంటర్ల వినతిపత్రం

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం ఆర్డీవో అఖిలకు మంగళవారం కామాక్షి దుర్గా కార్పెంటర్స్ అసోసియేషన్ నాయకులు విశ్వకర్మ యోజన, కార్పెంటర్ల సమస్యలపై వినతిపత్రం అందించారు. విశ్వకర్మ యోజన దరఖాస్తులు ఆన్‌లైన్ చేయడం జరిగిందని, శిక్షణ తరగతులు రామచంద్రపురంలో నిర్వహించాలని, శిక్షణ కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు అప్పారి శ్రీనివాస్, కార్యదర్శి దేవాదుల సూర్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



కూర్మావతారంలో వేంకటేశ్వరస్వామి

కూర్మావతారంలో దర్శనమిచ్చిన వేంకటేశ్వరస్వామి

రాయవరం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): దశావతార ఉత్సవాలను పురస్కరించుకుని రాయవరం వేంకటేశ్వరస్వామి మంగళవారం కూర్మావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అంగర బాబు, పెద్దింటి కృష్ణమాచార్యులు అర్చకత్వంలో స్వామివారికి పలు రకాల పూలతో అలంకరించారు. అనంతరం అష్టోత్తర, సహస్రనామాలతో తులసిదళ అర్చనలు, నీరాజన మంత్ర పుష్పాలు, మహా నివేదన జరిపారు. కార్యక్రమంలో భక్త సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మండల మహిళా సమాఖ్య కార్యదర్శి, అధ్యక్షురాలు, కోశాధికారి

ద్రాక్షారామ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా తోటపేట గ్రామ సంఘం అధ్యక్షురాలు వెలుగుబంట్ల వీర వెంకట సూర్యకుమారి ఎన్నికయ్యారు. మంగళవారం రామచంద్రపురం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో మండల సమాఖ్య కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా చోడవరానికి చెందిన కె.సత్యవతి, కోశాధికారిగా యనమదల గ్రామానికి చెందిన రవ్వ లక్ష్మీకుమారిని ఎన్నుకున్నారు. సమావేశానికి 48 గ్రామ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు. సమావేశంలో ఏపీఎం అర్జున్, శ్రీధర్ సిబ్బంది పాల్గొన్నారు.

మిగులు భూమి పంపిణీ చేయాలి

ద్రాక్షారామ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం కందులపాలెం గ్రామంలో మూడెకరాల సీలింగ్‌భూమిని పేదలకు పంపిణీ చేయాలని రైతు కూలీ సంఘం నాయకులు మంగళవారం రెవెన్యూ సదస్సులో తహశీల్దార్‌కు వినతి పత్రం అందించారు. గ్రామానికి చెందిన కొంత మంది సీలింగు భూమికి పట్టాదారు పాసు పుస్తకాలు, డాక్యుమెంట్లు సృష్టించి కొన్నేళ్లుగా అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. భూమిని స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ చేయాలని వారు కోరారు.



మండపేటలో క్రైస్తవ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం



ఆలమూరు సిద్ధార్థ హైస్కూల్‌లో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

లోక రక్షకుడి కరుణ అందరిపై ఉండాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ),డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): లోక రక్షకుడి కరుణ అందరిపై ఉండాలని మంత్రి సుభాష్ అన్నారు. క్రిస్మస్‌ను పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ శాంతిమార్గాన్ని అనుసరించాలన్నారు.

క్రైస్తవుల సంక్షేమానికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

మండపేట, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండపేట 7వ వార్డులో నిర్మించిన క్రైస్తవ కమ్యూనిటీ హాలును మంగళవారం ఆయన ప్రారంభించారు.కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పతివాడ నూకదుర్గారాణి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, వార్డు కౌన్సిలర్ నవరపు సతీష్, తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ గడి సత్యవతి తదితరులు తదితరులు పాల్గొన్నారు.

బెతెస్థ మందిరంలో క్రిస్మస్ వేడుకలు: మండపేటలోని బేతస్థ ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో సూర్య కన్వెన్షన్ హాలులో మంగళవారం రాత్రి చర్చి పాస్టర్ చిలుకూరి ఉదయ భాస్కర్ సారథ్యంలో క్రిస్మస్ వేడుకలు జరిగాయి. దీనికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. అనంతరం సంఘ కాపరి ఉదయభాస్కర్ మాట్లాడారు. క్రిస్మస్ సందర్భంగా కేక్ కట్ చేశారు. క్రిస్మస్ వేషధారణలు, నాటికలు ఆకట్టుకోగా, కార్యక్రమంలో సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకల్లో ప్రజా ప్రతినిధులు

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు: మండపేటలో మంగళవారం క్రిస్మస్ వేడుకలను జరుపుకున్నారు. తాపేశ్వరం శ్రీచైతన్య పాఠశాల, పట్టణంలో సంఘం కాలనీలో వున్న ఎంపీపీ పాఠశాల, ఎంపీఎస్ పాఠశాల, బ్యాంకు కాలనీలో వున్న ఆపిల్ పాఠశాలల్లో క్రిస్మస్ సందర్భంగా విద్యార్థుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో క్రైస్తవ గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిద్ధార్థ స్కూల్‌లో క్రిస్మస్ వేడుకలు

ఆలమూరు: ఆలమూరు శ్రీసిద్ధార్థ హైస్కూల్‌లో మంగళవారం క్రిస్మస్ వేడుకలు జరిపారు. స్కూల్ డైరెక్టర్ కె.ముల్లారావు క్రిస్మస్ వేడుకల ప్రాముఖ్యత తెలిపారు. విద్యార్థినీ, విద్యార్థులు క్రిస్మస్ వేషధారణలో అలరించారు. విద్యార్థుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో డైరెక్టర్‌తోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. చెముడులంక శ్రీసత్యా విద్యానికేతన్‌లో క్రిస్మస్ వేడుకలు పుత్రకుమార్ ఆధ్వర్యంలో జరిగాయి. క్రిస్మస్ వేషధారణలు, పాటలను విద్యార్థులు ఆలపించారు.

కొత్తపేట: క్రిస్మస్‌ను పురస్కరించుకుని బుధవారం జరిగే వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేశారు. విద్యుద్దీపాలతో పాటు క్రీస్తు జననం తెలిపే దృశ్యాలను చర్చిల వద్ద ఏర్పాటు చేశారు.



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న దృశ్యం

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మండపేట, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండపేట మండలం అర్తమూరులో మంగళవారం జరిగిన రెవెన్యు గ్రామసభకు తహశీల్దార్ తేజేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాటాడుతూ రైతుల భూసమస్యలతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందన్నారు. అర్తమూరు రెవెన్యూ సభలో రైతుల నుంచి పలు ఫిర్యాదులు తీసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే వేగుళ్ల

కపిలేశ్వరపురం: మండలంలోని తాతపూడి పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం గ్రామ రెవెన్యూ సదస్సు జరిపారు. ఈ సదస్సులో తహశీల్దార్ పి.చిన్నారావు మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్ఐ అర్జమ్మ, వీఆర్‌వోలు, సర్వేయర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది, గ్రామపెద్దలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

కొత్తపేట, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఇటీవల పలు ప్రమాదాల్లో గాయపడి చికిత్స పొంది ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మంగళవారం వాడపాలెంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చెక్కులను పంపిణీ చేశారు. నలుగురు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి నుంచి వచ్చిన రూ.2,16,810 విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బండారు బుల్లితాత, మైగాపుల గురవయ్య, పప్పుల కొత్తయ్య, బండారు వీరబాబు, కడియం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



వాడపాలెంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలి

ఆత్రేయపురం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని డీఎస్పీ వై.గోవిందరావు పేర్కొన్నారు. మంగళవారం ఆత్రేయపురం పోలీస్‌స్టేషన్‌లో బొబ్బర్లంక-ధవలేశ్వరం గ్రామాల ఫిషర్‌మెన్ సొసైటీ సభ్యులతో సమావేశం జరిపారు. ఇరువర్గాల పెద్దలు తమ సమస్యలను వివరించారు. డీఎస్పీ మాట్లాడుతూ చేపల వేట శాంతియుతంగా నిర్వహించుకోవాలని రొయ్యసీడ్ ఎవ్వరి పరిధిలో వారు పట్టుకోవాలని సూచించారు. సమస్యలు వస్తే తమ దృష్టికి తీసుకువచ్చి శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్నారు. సీఐ విద్యాసాగర్, ఎస్ఐ ఎస్.రాము ఉన్నారు.



ఫిషర్‌మెన్ సొసైటీ సభ్యులతో చర్చిస్తున్న డీఎస్పీ గోవిందరావు

మంత్రి పదవికి అమిత్‌షా రాజీనామా చేయాలి



కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ జిల్లాశాఖ అధ్యక్షుడు చిట్టిబాబు ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న పార్టీ శ్రేణులు

అమలాపురంటౌన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తక్షణం మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ జిల్లా శాఖ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అమిత్‌షా తక్షణం జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తొలుత కలెక్టరేట్ ఎదుట ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్, నియోజకవర్గ కోఆర్డినేటర్ అయితాబత్తుల సుభాషిణి, ఏఐసీసీ సభ్యుడు చీకట్ల అబ్బాయి, యార్లగడ్డ రవీంద్ర, పట్టణ శాఖ అధ్యక్షుడు వంటెద్దు బాబి, నాయకులు గెడ్డం సురేష్‌బాబు, మాచవరపు శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.



దేవులపల్లిని సత్కరిస్తున్న జేసీ తదితరులు

దేవులపల్లికి ప్రతిభా పురస్కారం

ద్రాక్షారామ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ద్రాక్షారామకు చెందిన ఏపీ కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర ఈసీ సభ్యుడు, జిల్లా ఛైర్మన్ దేవులపల్లి శ్రీకృష్ణ అభిరామ్‌కు మంగళవారం ప్రతిభా పురస్కారం అందించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన జాతీయ వినియోగదారుల దినోత్సవంలో ఆయన్ను జేసీ నిశాంతి సత్కరించి ప్రతిభా పురస్కారం అందించారు. కార్యక్రమంలో డీఎస్ఎం ఉదయభాస్కర్, లీగల్ మెట్రాలజీ అసిస్టెంటు కంట్రోలర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.



వెలిచేరులో బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న దృశ్యం

బెల్లపు ఊట ధ్వంసం

ఆత్రేయపురం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం వెలచేరు గోదావరిలంకలో ఎక్సైజ్ సీఐ కాత్యాయని ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం దాడులు జరిపారు. సారా తయారీకి సిద్ధంగా ఉన్న 500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీ విక్రయాలపై కఠినంగా వ్యవహరిస్తామని సీఐ హెచ్చరించారు. దాడులలో ఎస్ఐ అన్నవరం, సిబ్బంది పాల్గొన్నారు.

నాగిరెడ్డికి పలువురు నివాళి

ద్రాక్షారామ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ నాటక కళాపరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు, రంగస్థల వృత్తి కళాకారుల సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు దివంగత నాగిరెడ్డి సత్యనారాయణ వర్ధంతిని పురస్కరించుకుని పలువురు నివాళులర్పించారు. హసన్‌బాదలో సర్పంచ్, ద్రాక్షారామ నాటక కళాపరిషత్ అధ్యక్షుడు నాగిరెడ్డి సతీష్‌రావు, చోడిశెట్టి వీరభద్రరావు తదితరులతో పాటు బుర్రకథ కళాకారుడు వేమవరపు రాంబాబు, నాటక కళాపరిషత్ ఉపాధ్యక్షుడు కొండ తదితరులు నాగిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు.